ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
5
గురువారం 28 నవంబరు 2024





కొల్లేరు.. కిలకిల

కొల్లేరులోని ఆటపాక పక్షుల కేంద్రం వద్ద స్వదేశీ, విదేశీ పక్షులు కనువిందు చేస్తున్నాయి. అందమైన విహంగాల కిలకిలరావాలను ఆస్వాదించేందుకు పర్యావరణ ప్రేమికులు ఆసక్తి చూపుతున్నారు. పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. -6లో

8న ఎన్ఎంఎంఎస్ పరీక్ష : డీఈవో

ఏలూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపకారవేతన (ఎన్ఎంఎంఎస్) పరీక్ష డిసెంబరు 8న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నట్టు డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. విద్యార్థుల హాల్‌టిక్కెట్లను బీఎస్ఈ. ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో సంబం.దిత స్కూలు లాగిన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. స్కూలు హెచ్ఎంలు పాఠశాల యు-డైస్ కోడ్‌ను ఉపయోగించి వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు.



మావుళ్ళమ్మ దీక్ష విరమణ

భీమవరం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ దీక్షల విరమణ బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సుమారు 400 మంది మాల ధారులు అమ్మవారికి ఒక ఇరుముడి అందించి, మరో ఇరుముడిలోని నెయ్యితో నిండిన కొబ్బరికాయ, పూర్ణాహుతి సామగ్రిని హోమ గుండంలో వేసి దీక్ష విరమణ చేశారు.



కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, అధికారులు

బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చాలి : కలెక్టర్

ఏలూరు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చడానికి సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిషోరి వికాసం 2.0 జిల్లా స్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్రమం జిల్లా ఐసీడీఎస్ పీడీ కె.పద్మావతి అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం బాల్యవివాహాల వ్యతిరేకంగా జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులు, హాజరైన శిక్షణ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కిషోరి వికాసం 2.0 బాలికా స్వేచ్ఛా సంపూర్ణ సాధికారత కోసం జిల్లాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబరు 1098కు అందించాలన్నారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు, ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్, డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీఆర్డీఏ పీడీ విజయరాజు, డీఎంహెచ్‌వో ఇన్‌చార్జి డాక్టర్ జ్యోతి, డీసీపీవో సూర్యచక్రవేణి పాల్గొన్నారు.



వడాలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ ధాత్రి రెడ్డి

త్వరితగతిన ధాన్యం కొనుగోళ్లు : జేసీ

ముదినేపల్లి/మండవల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా నిర్వహించాలని రైతులు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని జేసీ ధాత్రిరెడ్డి ఆదేశించారు. ముదినేపల్లి మండలం వడాలి, మండవల్లి మండలంలోని రైతు సేవా కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామన్నారు. తహసీల్దార్ ఎస్‌కె.సుభాని, జిల్లా పౌరసరఫరాల అధికారి లక్ష్మీ, వ్యవసాయ శాఖ ఏడీ వెంకటమణి, ఏవో వేణుమాధవ్, డీసీఎంఎస్ మండల ఇన్‌చార్జ్ విజయకుమార్, వీఆర్వో పద్మావతి పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50 లక్షలు చెల్లించాలి..

చింతలపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూ నిర్వాసితుల రైతులకు న్యాయం జరగాలని మరోసారి రైతులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి దృష్టికి తెచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయన నిర్వాసిత రైతులతో బుధవారం సమావేశం నిర్వహించి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. భూముల ధరలు పెరిగినందున ఎకరాకు రూ.50 లక్షలు ఇవ్వాలని, అసైన్డ్ భూములకు ఇదే ధర వర్తింపజేయాలని రైతులు కోరారు. ముక్కంటి మాట్లాడుతూ రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మరోసారి మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్‌తో రైతుల సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో నిర్వాసిత రైతులతో పాటు ఏపీ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పుల్లూరి సోమశేఖరాచార్యులు, భూనిర్వాసిత రైతుల పోరాట కమిటీ కార్యదర్శి సి.హెచ్.అంజిబాబు, గోలి రామకృష్ణారెడ్డి, కొనకళ్ళ కృష్ణమూర్తి, రాంబాబు, వరలక్ష్మీ, సుమారు 40 మంది రైతులు పాల్గొన్నారు.



రైతులతో సమావేశమైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి

కష్టపడ్డాం.. మాకే కావాలి!

ఈడా చైర్మన్ పదవిపై టీడీపీలో తీవ్ర పోటీ



ఏలూరు నగరాభివృద్ధి సంస్థ(ఈడా) చైర్మన్ పదవి ఎప్పుడు భర్తీ చేయనున్నారు ? మిగతా నామినేట్ పదవులన్నింటి మాదిరిగానే ఈ పదవికి ఎవరో ఒకరిని నామినేట్ చేయాల్సి ఉంది. కూటమిలో అనేక మంది దీనిపై ఆశలు పెంచుకు న్నారు. ఒకవైపు పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ పదవులను వరుసగా భర్తీ చేస్తున్న క్రమంలో ఏలూరునే ఎందుకు మినహాయించారని అందరూ తెగ టెన్షన్ పడిపోతున్నారు.

- రేసులో వెంకట సత్య వరప్రసాద్, శివప్రసాద్, బలరాం
- ఎమ్మెల్యే బడేటిపై ఒత్తిడి
- ఇక తేల్చాల్సింది అధిష్ఠానమే



సత్య వర ప్రసాద్



శివ ప్రసాద్



ఎంఆర్డీ బలరామ్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

వరుసగా వివిధ నామినేట్ పదవులు కూటమి ప్రభుత్వం భర్తీ చేస్తూ వస్తోంది. ప్రత్యేకించి ఏలూరు జిల్లాలో ఒకరిద్దరు మినహా మరెవరికీ సరైన స్థానం లభించ లేదు. ఏలూరు నగరాభివృద్ధి సంస (ఈడా) చైర్మన్ పదవి ఖాళీగా ఉంది. ఈ పదవి కోసం కూటమిలో అత్యధికులు ఆశలు పెంచుకున్నారు. ఇంతకుముందు ఈడాకు చైర్మన్‌గా వ్యవహరించిన మధ్యాహ్నపు ఈశ్వరి పదవీ కాలం ముగియడంతో ఆ స్థానంలో బొద్దాని శ్రీనివాస్‌ను అప్పట్లో నియమించారు. ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలుకావడంతో రాజకీయ పరిణామాలు మారాయి. అప్పట్లో వైసీపీలో ఉన్న మధ్యాహ్నపు ఈశ్వరి, ఆమె భర్త బలరాంతో సహా వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎన్నికలకు ముందే ఇదంతా జరిగింది. ఎన్నికల్లో వైసీపీ ఓటమి అనంతరం వైసీపీ నేతలంతా టీడీపీ వైపు క్యూ కట్టారు. కొన్నాళ్ళపాటు ఈడా చైర్మన్‌గా ఉన్న బొద్దాని శ్రీనివాస్ కూడా టీడీపీలో చేరారు. ఈ క్రమంలో ఈడా ఖాళీ అయ్యింది. దీనిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఇతర నగరాభివృద్ధి సంస్థల మాదిరిగానే కసరత్తుకు దిగింది. అయినా దీనిపై ఆశలు పెంచుకున్న వారి సంఖ్య ఇప్పటికే భారీ సంఖ్యలో ఉంది. ఎందుకంటే ఉమ్మడి పశ్చిమలో మూడొంతుల మేర విస్తీర్ణంలో ఈడా పరిధి ఉంటుంది. భవనాల నిర్మాణానికి ప్లాన్ అనుమతులు ఇవ్వాలన్నా దీనికే సర్వాధికారాలు ఉంటాయి. దీంతో ఎన్నికల ముందు నుంచే టీడీపీలో విస్తృతంగా కష్టపడిన అనేకమంది అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత తమకు ఈడాలో అవకాశం ఇవ్వాల్సిందిగా ప్రస్తుత ఎమ్మెల్యే బడేటి చంటిని డిమాండ్ చేస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడింది కాబట్టి ఈడాకు చైర్మన్ ఎవరు కాబోతున్నారనే దానిపైనే తీవ్ర ఒత్తిడి నెలకొంది. కూటమిలో జనసేన పక్షాన సీనియర్ నేతగా ఉన్న రెడ్డి అప్పలనాయుడును ఈ మధ్యనే ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా అదృష్టం వరించింది. ట్రైకార్ చైర్మన్‌గా పోలవరానికి చెందిన బొరగం శ్రీనివాస్ ఎంపికయ్యారు. మరో ఇద్దరు, ముగ్గురు మాత్రమే వివిధ కార్పొరేషన్‌లలో డైరెక్టర్లుగా జిల్లా నుంచి నామినేటెడ్ పదవులు పొందారు. ఈక్రమంలో ఎప్పటికప్పుడు ఆశలు పెంచుకుని పలానా పదవి తమకు దక్కేలా చూడండంటూ సిట్టింగ్ ఎమ్మెల్యే చంటిపై ఒత్తిడి తెస్తున్నారు.

పోటాపోటీ రేస్

ఏలూరు నగరాభివృద్ధి సంస్థ చైర్మన్ పదవికి టీడీపీలో పోటీ అత్యధికంగానే ఉంది. కష్టించిన దానికి తగిన ప్రతిఫలం అందేలా సహకరించాలని పలువురు నాయకులు ఎమ్మెల్యేను కోరుతూనే ఉన్నారు. ఇంతకుముందు ఈడా చైర్మన్‌గా వ్యవహరించిన మధ్యాహ్నపు ఈశ్వరికి మరోసారి అవకాశం ఇవ్వాలని ఆమె భర్త, టీడీపీ సీనియర్ నేత ఎంఆర్డీ బలరాం గట్టి పట్టుపడుతూనే ఉన్నారు. వైసీపీలో తన భార్య ఈశ్వరికి ఈడా చైర్మన్‌గా రెండోసారి అవకాశం ఇవ్వాలని కోరినా అప్పట్లో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న ఆళ్ల నాని వ్యతిరేకించారు. దీంతో తీవ్ర అసంతృప్తితోనే ఎంఆర్డీ దంపతులు వైసీపీ నుంచి బయటపడి టీడీపీలో చేరారు. ఈ తరుణంలో తిరిగి ఈసారి కూడా ఈడా చైర్మన్ పదవి తమకు దక్కేలా చూడాలని పార్టీ నాయకత్వానికి ఇప్పటికే విన్నవించారు. ఇంకోవైపు ఇంతకుముందు బడేటి బుజ్జి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆయనకు పూర్తిగా చేదోడు వాదోడుగా ఉన్న చల్లా వెంకట సత్యవరప్రసాద్ (కంప్యూటర్ ప్రసాద్) సైతం ఈ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే బడేటి చంటికి పూర్తిగా ఎన్నికల వ్యవహారాల్లో సాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే తాను ఈడా చైర్మన్ పదవికి అర్హుడినని, తనకు ఈ అవకాశం ఇస్తే ఆమోద యోగ్యంగా ఉంటుందంటూ ప్రసాద్ తన మనసులోని మాటను పలుసార్లు బయట పెట్టారు. ఆయనతోపాటు నగర అధ్యక్షుడు శివప్రసాద్ రంగంలో ఉన్నారు. ఆయన కూడా ఇదే పదవిని ఆశిస్తున్నారు. ఎమ్మెల్యే చంటి ఇప్పటికే ఏలూరువాసులకే అవకాశం ఇవ్వాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. ఈ మధ్యనే ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పేరు ఈ పదవి కోసం వినిపించింది. అయితే ఆయనకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టేందుకు అధిష్ఠానం సుముకంగా ఉన్న తరుణంలో ఈడా చైర్మన్ పదవి ఇస్తారా, లేదా ఎమ్మెల్సీ పదవి ఇస్తారా అనేది కూడా తేలబోతుంది.

తుఫాన్ గుబులు

రైతుల్లో ఆందోళన

పెరిగిన చలి తీవ్రత.. భారీగా పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు

ఏలూరుసిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మంగళవారం తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఇది ఉత్తర వాయువ్యంగా పయనించి బుధవారం తుపానుగా బలపడనుందని వాతావరణ శాఖ చెబుతోంది. దీని ప్రభావం దక్షిణకోస్తా ప్రాంతం పైనే ఉన్నా ఉత్తర కోస్తాలోను అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. వాతావరణ పరిస్థితులు దృష్ట్యా వరి కోతలు వాయిదా వేసుకోవాలని, వరి పంట కోత కోసిన రైతులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో 80 వేల హెక్టార్లలో సార్వా వరి సాగు జరిగింది. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. జిల్లాలో తుఫాను ప్రభావమో ఏమోగాని మళ్ళీ బుధవారం సాయంత్రం నుంచి చలి తీవ్రత బాగా పెరిగింది. రాత్రి ఉష్ణోగ్రతలు 17 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. తుఫాన్ నేపథ్యంలో అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశామని విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్మన్‌రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు ఆర్ఆర్‌పేటలోని విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయంలో 94409 02926 నంబర్‌తో 24 గంటల పాటు 3 షిఫ్టులలో పనిచేసే విధంగా కంట్రోలు రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

జిల్లాలో చలితీవ్రత ఇలా..

తేదీ	ఉష్ణోగ్రత (పగలు/రాత్రి) సెంటీగ్రేడ్‌లో
నవంబరు 23	32/18
నవంబరు 24	31/19
నవంబరు 25	31/19
నవంబరు 26	30/19
నవంబరు 27	30/17

వాయు కాలుష్య రహిత నగరంగా ఏలూరు

- ప్రత్యేక కార్యాచరణ అమలు చేయండి
- వాయు కాలుష్య నియంత్రణ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ శివకిశోర్

ఏలూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు వంటి చిన్న నగరంలో వాయుకాలుష్యం వ్యాపించడంపై మూలకారణాలు తెలుసుకుని, వాటిని నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. నగరాన్ని వాయు కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దే కార్యాచరణలో భాగంగా ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాల వినియోగంపై ప్రజలకు అవగాహన కలిగించి, వాటి వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. నేషనల్ క్లియర్ ఎయిర్ ప్రోగ్రాంకింద ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఆధ్వర్యంలో వాయుకాలుష్య నియంత్రణపై ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో జరిగింది. నగరంలో ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాల చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటాలని కమిషనర్‌ను ఆదేశించారు. నగరంలో చెత్తను సేకరించే వాహనాలను ఎలక్ట్రిక్ లేదా సీఎన్‌జీ వాహనాలుగా మార్చే విషయాన్ని పరిశీలించాలన్నారు. నేషనల్ యాంబియెంట్ ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్స్ ప్రకారం దేశంలో సగటున వాయు కాలుష్యం 60 యూజీలు కాగా, ఏలూరులో ప్రస్తుతం 63 యూజీలుగా నమోదవుతోందని, దీనిని జాతీయ సగటు కంటే తక్కువ స్థాయికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పెట్రోల్, డీజిల్ కల్తీ జరుగకుండా నిఘా పెట్టాలన్నారు. ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ సమీకృత ట్రాఫిక్ పర్య వేక్షణ విధానం ద్వారా వాయు కాలుష్యానికి పర్యవేక్షించడానికి చర్యలు చేపడతామన్నారు. ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, అటవీశాఖ సామాజిక వనవిభాగం జిల్లా అధికారి సీహెచ్.సూర్య నారాయణ, డీఎస్‌వో సత్యనారాయణ రాజు, జిల్లా పరిశ్రమల కేంద్రం ఇన్‌చార్జి జీఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, కమిషనర్ భానుప్రతాప్, డీటీసీ షేక్‌కరీం, వ్యవసాయశాఖ జేడీ శైలజ, ఆర్ అండ్ బీ ఈఈ కిషోర్ బాబూజీ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పరీక్ష!

- అందినకాడికి దోచేస్తున్న ల్యాబ్‌ల నిర్వాహకులు
- ల్యాబ్‌ల్లో కానరాని ధరల పట్టిక
- తనిఖీలు చేసినా షోకాజ్ నోటీసులతో సరి



ఏలూరు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చిన్నపాటి కాలు నొప్పి వచ్చినా.. తల నొప్పి వచ్చినా, కడుపులో మంట అంటూ వైద్యుడి వద్దకు వెళ్లితే ల్యాబ్ పరీక్షలు తప్పడం లేదు. నేడు వ్యాధి ఏదైనా రక్తపరీక్షలు, స్కానింగులు సర్వ సాధారణంగా మారాయి. కొంతమంది వైద్యులైతే తమ ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న ల్యాబ్‌లలోనే చేయించాలని మరీ చెప్పి అప్పటికప్పుడు ఆ పరీక్షలు చేయిస్తున్నారు. ఇక ల్యాబ్ నిర్వాహకులు వారి ఇష్టం వచ్చినట్టు సొమ్ములను వసూలు చేస్తున్నారు. జిల్లాలో సాధారణ ల్యాబ్‌లు లైసెన్సు పొందినవి 96 ఉండగా, అత్యాధునిక పరిజ్ఞానంతో ఉన్న ఖరీదైన ల్యాబ్‌లు 10 ఉన్నాయి. ఇంకా 81 ఆస్పత్రులు తమ అనుబంధ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి అనుమతులు పొందారు. మొత్తం మీద జిల్లాలో 186 ల్యాబ్‌లకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి అనుమతులను పొందాయి. ఎవరైనా ల్యాబ్ పెట్టాలంటే ఎంఎల్‌టీ లేదా డీఎంఎల్‌టీ కోర్సు సర్టిఫికెట్ ఉండాలి. అంతేకాకుండా మరో ఎంబీబీఎస్ చదివిన వైద్యుల సర్టిఫికెట్, వారు ఏ పరీక్షకు ఎంత సొమ్ము వసూలు చేస్తారో ధరల పట్టిక, ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో ఆ స్థలానికి సంబంధించిన యజమానితో ఒప్పంద పత్రం, ఫైర్ సేఫ్టీ వంటి సర్టిఫికెట్లతో దరఖాస్తు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి చేసుకోవాలి. లైసెన్సు పొందేందుకు దరఖాస్తులో చూపించిన ధరల పట్టికను ల్యాబ్‌లో ప్రదర్శనగా పెట్టాల్సి ఉన్నా చాలా ల్యాబ్‌ల్లో కానరావడం లేదు. ఒకవేళ ఎక్కడైనా ధరల పట్టిక ఉన్నా అవి పాత ధరలంటూ మరీ వసూలు చేస్తున్నారు. జిల్లా అధికారులు ఉండే ఏలూరు నగరంలోనే కొన్ని ల్యాబ్‌ల నిర్వాహకులు అడ్డంగా దోచేస్తున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది ఆర్ఎంపీలే వైద్యుల అవతారం ఎత్తి ఎలాంటి అనుమతులు లేకుండానే ల్యాబ్‌లు నిర్వహించేస్తున్నారు.

నామమాత్రపు తనిఖీలు

కొంతమంది ల్యాబ్ నిర్వాహకులు నాణ్యతలేని పరీక్షలు నిర్వహించి రిపోర్టులను ఇస్తు న్నారు. కొంతమంది అనుమతి లేని మిషన్లు పెట్టేసి పరీక్షలు చేస్తున్నారు. డెంగీ ఫీవర్ నిర్ధారణకు మూడు విధాలైన (కిట్లు, పీసీఆర్, ఎలిసా) పరీక్షలు ఉన్నా ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో మాత్రమే స్పష్టమైన డెంగీ నిర్ధారణ పరీక్ష (ఎలిసా) వైద్య పరీక్ష యంత్రం ఉంది. జిల్లాలో ఇష్టానుసారంగా అనుమతులు లేని ల్యాబ్‌లను నిర్వహిస్తున్న, అనుమతి తీసుకున్న కొంతమంది ల్యాబ్ నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారే విమర్శలు వస్తున్నాయి. ఒకవేళ తనిఖీలు జరిగినా చర్యలు శూన్యమనే తెలుస్తోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 50 ల్యాబ్‌లను తనిఖీలు చేసి 50 మందికి షోకాజు నోటీసులు జారీ చేసినా ఏ ఒక్కరిపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ధరల బోర్డులు పెట్టాలి



ఇటీవల ల్యాబ్‌లపై ఫిర్యాదులు వస్తున్నా యి. వచ్చే వారంలో ల్యాబ్ నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించి తగిన ఆదేశాలు ఇస్తాం. ఒకటి రెండు సార్లు షోకాజు నోటీసులు ఇచ్చి మూడోసారి ఖచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి ల్యాబ్‌లో ధరల బోర్డులు పెట్టాలి. సిబ్బంది కొరత కారణంగా తనిఖీలు నిర్వహించలేకపోతున్నాం ఉన్న సిబ్బందితోనే తనిఖీలు చేసి షోకాజు నోటీసులు అందిస్తున్నాం. నోటీసులకు స్పందించకపోతే తదుపరి చర్యలు తీసుకుంటాం.

డాక్టర్ ఎస్.శర్మిష్ట, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి, ఏలూరు జిల్లా

ఆహ్లాదాన్ని పంచే పార్కులో.. నర్సరీనా..?

- పార్కులో కొంతభాగాన్ని అద్దెకు ఇచ్చిన నగర పాలక సంస్థ

ఏలూరు టూటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆహ్లాదం, ఆనందాన్ని పంచే పార్కుల్లో ఆ రెండూ కరువయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు రకరకాల పనులతో అలసిపోయిన చాలామంది కాస్తా ప్రశాంతత కోసం సాయంత్రం పూట పార్కులకు వెళ్లి సేద తీరుతుంటారు. అయితే ఏలూరు నగరపాలక సంస్థ పార్కుల్లో అలాంటి వాతావరణం ఎక్కడా కనిపించదు. లక్షలాది రూపాయలు పార్కుల్లో సౌకర్యాలు కల్పించినట్టు అధికారులు రికార్డుల్లో చూపిస్తున్నా పార్కుల్లో అలాంటి వాతావరణం లేదు. నగరపాలక సంస్థ ఎదురుగా ఉన్న పార్కును లక్షలాది రూపా యలతో అభివృద్ధి చేశారు. కానీ ఆ పార్కులో నగర ప్రజలు వెళ్లి సేదతీరే అవకాశాలు లేవు. ఎందుకంటే ఆ పార్కులో కొంతభాగాన్ని నర్సరీ మొక్కలు పెంచుకుని అమ్ముకునేందుకు బయట వ్యక్తులకు లీజుకు ఇచ్చారు. అది కూడా నామమాత్రంగా కేవలం నెలకు రూ.15 వేలు అద్దె చెల్లించే విధంగా లీజుకిచ్చారు. నగరంలో కార్పొరేషన్ నిర్మించిన ఎన్నో షాపులు అద్దెకివ్వగా చిన్నచిన్న షాపులే రూ.10 వేల నుంచి రూ.15 వేల అద్దె ఉంటుంది. అలాంటిది ఏకంగా పార్కులో కొంతభాగాన్నే రూ.15 వేలు లీజుకు ఇచ్చారు. ఈ క్రమంలో కొందరు అధికారు లకు 'ప్రైవేటు'గా వాటాలు వెళ్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, నర్సరీని పార్కు నుంచి తొలగించాలని నగరవాసులు కోరుతున్నారు.



కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా వున్న పార్కులో నర్సరీ నిర్వహిస్తున్న దృశ్యం





పర్యాటకం

కొల్లేరు కిలకిల





పెయింటెడ్ స్టార్క్ (ఎర్రకాళ్ళ కొంగ)

దీని పేరు ఎర్రకాళ్ళ కొంగ. తెల్లటి రెక్కలపై గులాబి రంగు, కాళ్ళపైన ఎరుపు, వీపు మీద నలుపు, గోధుమరంగులో ముక్కు. చిత్రకారుడు గీసిన చిత్రంలా కొల్లేరులో దర్శనమిస్తుంటుంది. పిల్ల దశలో ముక్కు నల్లగా రెక్కలు నలుపు రంగులోనూ ఉంటాయి. పెద్దదయ్యే సమయానికి పైరంగులు పోలి ఉంటుంది. పక్షుల కేంద్రంలో ఎక్కడ చూసినా గూళ్ల నిర్మాణం చేసుకుని సంతానోత్పత్తి చేసుకునే దృశ్యాలు కనిపిస్తుంటాయి.

నత్తకొట్టు (ఓపెన్ బిల్ స్టార్క్)

ఈ పక్షులు చిన్న చిన్న నీటి కుంటల్లో, పంటపొలాల్లో గుంపులు గుంపులుగా కనిపిస్తుంటాయి. ఇవి మట్టిలో ఉండి అనేక క్రిమికీటకాలను ఆహారంగా తీసుకుంటూ ఉంటాయి. పంటపొలాల్లోని నేలల్లో ఉన్న క్రిములను తినడం వల్ల ఆ పంటలకు ఎంతో మేలు చేస్తుంది. అలాగే ఇవి నత్తలను వేటాడి ఆహారంగా తీసుకుంటాయి. ఇవి కొల్లేరు సరస్సులో అనేకచోట్ల కనువిందు చేస్తుంటాయి.

గూడబాతు (పెలికాన్)



120 నుంచి 150 సెంటీమీటర్లు పొడవు సుమారు 6 కేజీల బరువు ఉంటుంది. ఇది ప్రధానంగా తెలుపు రంగులో ఉండి బూడిద రంగులో తల, ఈ పక్షులకు విస్తరించదగిన గొంతు సంచులుంటాయి. వీటి సహాయంతో ఇవి నీటి ఉపరితలం నుంచి చేపలను గరిటె వలే పట్టుకుంటాయి. సుమారు 2 కేజీల చేపను సైతం ఒక్కసారిగా తినగలిగే సామర్థ్యం ఉంది. ఇవి చెట్లలో గూళ్ళను పెడతాయి. ప్రతీ సంవత్సరం అవే చెట్లకు వలస వస్తుంటాయి. ప్రతీ సంవత్సరం సెప్టెంబరు నెలలో గూళ్ళ నిర్మాణం చేసుకొని అక్టోబరు, నవంబరు నెలల్లో 2 లేక 3 గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేసుకుంటాయి. 3 నెలల అనంతరం పిల్లలతో సహా విదేశాలకు తరలివెళ్తాయి.



నల్లకంకణాల పిట్ట (బ్లాక్ ఐబిస్)

నల్లకంకణాల పిట్ట 68 సెంటీమీటర్ల పొడవు ఉంటుంది. కిందకి వొంపు తిరిగి నల్లటి ధృడమైన ముక్కు కలిగి ఆకుపచ్చ, వంగ రంగు ఛాయతో నిండు గోధుమరంగుతో ఉంటుంది. ఇది చిత్తడి నేలలు, చెరువులు, పొలాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఇది కొల్లేరు అభయారణ్యంలోనే గాక పంటపొలాల్లోను వేటాడుతూ జీవిస్తుంటుంది.

వలస పక్షులతో కళకళ..

కొల్లేటి పక్షులు.. చూసేకొద్దీ చూడాలనిపించే అందం వాటి సొంతం.. ఒకటి కాదు..రెండు కాదు.. రకరకాల పక్షులు ఏటా ఖండాంతరాలు దాటి కొల్లేరు తీరానికి చేరతాయి.. కొల్లేరులో చేపలను వేటాడి తింటాయి.. ఇక్కడే సంతానోత్పతి చేసుకుంటాయి.. కొల్లేటి పక్షుల కిలకిలారావాలతో ప్రకృతి పులకరిస్తుంది... పర్యాటకుల మనసు పరవశిస్తుంది.. ఏటా శీతాకాలంలో ఇక్కడకు వందల సంఖ్యలో విదేశీ పక్షులు వస్తుంటాయి. పర్యావరణ ప్రేమికులను రారమ్మని ఆహ్వానిస్తుంటాయి.. కొల్లేరుకు వచ్చే కొన్ని పక్షుల గురించి తెలుసుకుందాం..

కైకలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతిపెద్ద రెండో మంచినీటి సరస్సు కొల్లేరు... స్వదేశీ, విదేశీ పక్షుల విడిది కేంద్రం. ఇక్కడ 185 రకాల పక్షులు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. వీటిలో అత్యధికంగా వలస పక్షులుగా పేరొందిన పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. కొల్లేరు సరస్సులో ఆటపాక పక్షుల కేంద్రానికి సైబీరియా, ఆస్ట్రేలియా, కెనెడా తదితర దేశాల నుంచి వేల కిలోమీటర్ల ప్రయాణించి ప్రతీ సంవత్సరం నవంబరు నెలలో వలస వస్తుంటాయి. పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షులు కొల్లేరుకు తరలివచ్చేది ప్రధానంగా సంతానోత్పత్తి చేసేందుకే. ఎర్రకాళ్ళ కొంగ (పెయింటెడ్ స్టార్క్), గూడబాతు (పెలికాన్), గుడ్డికొక్కిరాయి (సాండ్ హెరాయిన్), కేపరాయి (గ్రే హెరాయిన్), నత్తకొట్టు (ఓపెన్ బిల్ స్టార్క్) పక్షులు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

పర్యాటక అభివృద్ధికి మరింత కృషి



కొల్లేరులో పక్షులను తిలకించేందుకు పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అదనంగా మరో అధునాతన బోటు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్ప టికే రెండు ఉన్నాయి. మూడో బోటు కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు చేశాం. పక్షుల ఆవాస కేంద్రాలు ఏర్పాటు చేసుకునేందుకు మరో 20 కృత్రిమ ఐరన్ స్టాండ్లను మార్చి నాటికి ఏర్పాటు చేస్తాం.

-నాగలింగాచార్యులు, అటవీశాఖ రేంజర్, కైకలూరు

వైట్ పెలికాన్



ఇది అరుదైన పక్షి. కొల్లేరు సరస్సుకు అప్పుడప్పుడు వలస వచ్చే ఈ అరుదైన పక్షి పేరు వైట్ పెలికాన్. ఇవి కొల్లేరుకు వచ్చే సమయంలో 4 లేదా 5 పక్షులు మాత్రమే అటవీశాఖ అధికారులకు కనిపిస్తుంటాయి. కొద్దిరోజులలోనే మరో ప్రదేశానికి తరలి వెళ్తుంటాయి. ఇది సుమారుగా 5 నుంచి 9 కేజీల బరువు ఉంటుంది. ఈ పక్షి 130 నుంచి 180 సెంటీమీటర్లు పొడవు కల్గి ఉంటుంది.

జమ్ముకోడి



ఈ పక్షి చిత్తడినేలలు, గడ్డి ప్రాంతాల్లో చిన్న నీటి మడుగుల్లో జీవిస్తుంటుంది. ఇది భారతదేశంలో అనేక రాష్ట్రాల్లో చిన్న చిన్న నీటి మడుగుల వద్ద కనిపిస్తుంటుంది. ఇది చూసేందుకు చాలా అందంగా కనిపిస్తుంది.

ఆటపాక వెళ్లాలంటే..

కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రానికి చేరుకునేందుకు రోడ్డు, రైల్వే మార్గాల ద్వారా చేరుకోవచ్చు. విజయవాడ, భీమవరం నుంచి వచ్చే వారు రైలు, బస్సు ద్వారా కైకలూరు చేరుకోవాలి. అలాగే ఏలూరు, భీమవరం, గుడివాడ నుంచి బస్సులకు వచ్చేవారు కైకలూరులో దిగి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పక్షుల కేంద్రానికి ఆటోల ద్వారా చేరుకోవచ్చు. ఆటపాకలో పక్షుల కేంద్రానికి చేరుకునే రహదారికి అటవీశాఖ అధికారులు మార్గాన్ని చూపుతూ బోర్డు ఏర్పాటు చేశారు.

గ్రే హెరాయిన్ (నారాయణ పక్షి)



ఈ పక్షికి ముక్కు పసుపురంగులో, తల తెల్లగానూ, నల్లటి ఈకలతో పొడవైన మెడతో పొట్టపై నల్లని మచ్చలతో ఉంటుంది. ఈ పక్షి సుమారుగా 90 నుంచి 98 సెంటీమీటర్ల పొడవు ఉంటుంది. ఈ పక్షి ఆహారం కోసం ఎంతసేపైనా ఒంటరిగా నిరీక్షిస్తుంది.



నల్లరెక్కల ఉల్లంకి పిట్ట

ఈ పక్షి ఎత్తు 35 నుంచి 40 సెంటీమీటర్లు ఉంటుంది. నలుపు, తెలుపు రంగులో ఉండి నాజూకుగా కనిపిస్తుంది. పొడవైన గులాబిరంగు కాళ్లు.. నిటారైన చక్కని ముక్కు, ఎగురు తున్నప్పుడు పైరెక్కలు నల్లగాను కాళ్ళు తోకకన్నా పొడవుగా వెనుక ఉంటాయి. పిల్ల దశలో లేతపసుపు రంగు అంచులతో గోధుమరంగు పైభాగాలు కలిగి ఉంటుంది. ఇవి ఎక్కువగా చిత్తడి నేలల్లో, నీటి కుంటల్లో, చెరువుల్లో తక్కువ లోతు నీటి సాంద్రత ఉన్న ప్రదేశాల్లో జీవిస్తుంటుంది.

పాముబాతు పక్షి (డార్టర్)



ఈ పక్షి పొడవైన మెడ, నాజూకైన తల, పదునైన ముక్కు, పొడవైన తోక కలిగి ఉంటుంది. ఇది శరీరంలో చాలా భాగం నీటిలో మునిగి తరచుగా ఈదుతూ కన్పిస్తుంది. ఎక్కువగా రెక్కలను ఆరబెడుతున్నట్లుగా చాచి ఉంటుంది. ఎదిగిన పక్షి మెడ కింద తెల్లటి చార, భుజభాగాల్లో తెల్లటి చారలు కల్గి ఉంటుంది. కొల్లేరు సరస్సు, నీటి మడుగులు, నెమ్మదిగా ప్రవహించే నీటి ప్రవాహాల మధ్య మాటు వేసి చేపలను వేటాడుతుంది.

పేరెంట్-టీచర్స్ మీటింగ్ పండుగలా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం రూరల్, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి) : మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని మధుర స్మృతులను మిగిల్చేలా ఒక పండుగ వాతావరణంలో నిర్వ హించాలని విద్యాశాఖ అధికారులకు జిల్లా కలె క్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. బుధ వారం కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి డీఈవో, డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు డిసెంబరు 7న నిర్వహించనున్న మెగా పేరెంట్ - టీచర్ సమా వేశాలపై దిశా నిర్దేశం చేశారు. విద్యార్థులు, వారి తల్లితండ్రులు, ప్రజాప్రతినిదులు, స్ఫూర్తి దాయకమైన వ్యక్తులను, పాఠశాల పూర్వ విద్యా ర్థులను, పాఠశాల యాజమాన్య కమిటీని, దాత లను దీనిలో భాగస్వామ్యులను చేయాలన్నారు. దీనికోసం రేపటి నుంచే పాఠశాలల వారీగా కార్యాచరణ సిద్ధం చేసి ఎంఈవోల ద్వారా జిల్లా విద్యాశాఖాధికారికి అందజేయాలన్నారు. జిల్లా లోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ పాఠశా లలు, ఆదర్శ పాఠశాలలు, కెజిబీవీల్లో మొత్తం 1,375 పాఠశాలల్లో ఈ సమావేశాలను నిర్వహిం చాలన్నారు. విద్యార్థుల ప్రోగెస్ రిపోర్టును వివ రించడంతో పాటు, పాఠశాల అభివృద్ధికి సల హాలు, సూచనలు తీసుకోవాలన్నారు. సమా వేశం ఉదయం 9 గంటలకు మొదలై మధ్యా హ్నం 1 గంటకు చక్కటి భోజనంతో ముగు స్తుందన్నారు. విద్యార్థులు తమ సృజనాత్మకతో తయారు చేసిన ఆహ్వాన పత్రాల ద్వారా వారే తమ తల్లితండ్రులను సమావేశానికి ఆహ్వానిం చాలన్నారు. 12 రకాల కమిటీలను ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థులు, తల్లితండ్రులతో వేయా లని చెప్పారు. కల్చరల్ కార్యక్రమాలను నిర్వ హించడంతో పాటు, తల్లితండ్రులకు రంగోలి, టగ్ ఆఫ్ వార్ తదితర పోటీలను నిర్వహించాల న్నారు. కార్యక్రమం అనంతరం ఫోటోలను యాప్‌లో అప్లోడ్ చేయాలని, డాక్యుమెంటేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా విద్యాశా ఖాధికారి ఎంటీ నారాయణ, ఏపీసీ శ్యాంసుం దర్, సీఎంవో చంద్రశేఖర్, డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.



మలేషియా కరాటే పోటీలకు భీమవరం విద్యార్థులు

భీమవరం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యో తి) : అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు మలేషియా వెళ్తున్న భీమవరం ఎస్‌జెజీఎమ్ హైస్కూల్ విద్యార్థులను శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వ ర్యంలో సత్కరించారు. క్రీడలతో మానసిక శారీ రక శాంతి లభిస్తుందని, బాల్యం నుంచి విద్యా ర్థులు క్రీడలపట్ల ఆసక్తిని పెంచేలా తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని హైస్కూల్ సెక్రటరీ జూపూడి నాగ దమయంతి అన్నారు. కరాటేలో శిక్షణ పొంది 13 సార్లు అవార్డులు, గోల్డ్‌మెడల్స్ సాధించి మలే షియా అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు వెళ్ళటం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకు వాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 29 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు మలేషియాలో జరిగే అంతర్జాతీయ కరాటే పోటీలకు భీమ వరం నుంచి అశ్విని, ప్రియ, జెర్సీలు వెళ్తున్నా రని తెలిపారు. హెచ్ఎం దనం, ఉపాధ్యాయులు పద్మావతి, ఉమామహేశ్వరి, రుక్మిణి, సాయి రామ్, లక్ష్మీరత్నం పాల్గొన్నారు.


రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజ కొంటాం

మండవల్లి నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొను గోలు చేస్తామని జిల్లా జాయింట్‌కలెక్టర్ ధాత్రి రెడ్డి చెప్పారు. మండవల్లి మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలన జేసీ పరిశీలించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులెవరు ఆందోళన చెందవద్దని, జిల్లాలో ఇప్పటికే నూర్చ బడిన ధాన్యం కొనుగోలు, రవాణా చేసేం దుకు తగినన్ని గోనెసంచులు, వాహనాలతో సహా అన్నిరకాల ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తెలి పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ప్రక్రియను అనం తరం వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కేంద్రాన్ని జేసీ పరిశీలించారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మీ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్లు పరిశీలించిన జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

జలజల జారుతున్న జలపాతమా..!



బుట్టాయిగూడెం మండలం ముంజులూరు అటవీ ప్రాంతంలో జలపాతం →

పశ్చిమ ఏజెన్సీలో పర్యాటకులకు ఆహ్లాదం

ఆహ్వానం పలుకుతున్న ముంజులూరు జలపాతం

కొయ్యలగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చుట్టూ ఎత్తైన కొండలు..మధ్యలో జాలువారుతున్న జలపాతం.. ఇది పశ్చిమ ఏజెన్సీలోని ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం ముంజులూరు అటవీ ప్రాంతంలో ఉంది. ప్రతీ సంవత్సరం కార్తీకమాసం నుంచి మార్చి వరకు పర్యాటకుల సందడి ఎక్కువగా ఉంటుంది. సమీప ప్రాంతాల నుంచి విద్యార్థులు, పర్యాటకులు వాహనాల్లో విహారయాత్రకు వస్తున్నారు. పూర్తిగా అటవీ ప్రాంతంలో ఈ జలపాతం ఉండటంతో ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. భీమవరం, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. సుమారు 20 కిలోమీటర్లు అటవీ ప్రాంతంలోనే ప్రయాణం చేయ్యల్సి ఉంది. అక్కడ నుంచి రెండు, మూడు కిలోమీటర్లు నడకమార్గం ద్వారా జలపాతం చేరుకోవాలి. ఈ రహదారిలో సెలయేళ్ళను దాటుకుంటూ ఈ జలపాతానికి చేరుకోవడం పర్యాటకులకు ఎంతో ఆహ్లాద కరంగా ఉంటుంది. రెండు కిలోమీటర్లు నడిచి అలసిపోయిన పర్యాటకులు జలపాతం చూడగానే అలసట మరిచి సేదతీరుతారు.



రోడ్డు మార్గం అభివృద్ధి చేయాలి

ముంజులూరు జలపాతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్థానిక గిరిజనులు, పర్యాటకులు కోరుతున్నారు. ఈ జలపాతానికి వెళ్ళే మార్గం సక్రమంగా లేక వాహనాలు అనేక ప్రమాదాలకు గురవుతున్నాయి. దీని వల్ల పర్యాటకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి రాళ్ళలో వాహనాలు నడపటం వాహనాలు పంక్చర్లు పడుతున్నాయని చెబుతున్నారు. నడకమార్గమంతా అభివృద్ధి చేసి పర్యాటకులు జలపాతానికి సులువుగా చేరుకనేలా రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గ్రామస్తుల శ్రమదానంతో మరమ్మతులు

ఈ జలపాతాన్ని చూడటానికి పర్యాటకులు ఎక్కువగా రావడంతో ఆ గ్రామస్థులు ఆ రహదారి వెంబడి గోతులు పూడ్చటానికి శ్రమదానం చేస్తున్నారు. పర్యాటకులు కొంతమంది వారికి తోచిన సహాయాన్ని అందించి మార్గంలో రాళ్లు లేకుండా చేయాలని కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక కేంద్రాలకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటిస్తునందున ఈ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



మద్దిక్షేత్రంలో ఘనంగా తెప్పోత్సవం

జంగారెడ్డిగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గురవాయి గూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా స్వామివారికి లక్షచామంతిపూలతో పుష్పార్చన నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించిన హంసవాహనంలో ఉంచి ఆలయ ప్రాంగ ణంలో ఉన్న కొలనులో తెప్పోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేసినట్లు ఈవో చందన తెలిపారు.

క్షీరారామంలో లక్ష దీపోత్సవం

పాలకొల్లు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రమైన క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి లక్ష దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, దంపతులు పూజా కార్యక్రమాలు చేసి ప్రారంభిం చారు. బుధవారం శ్రీక్షీరారామలింగేశ్వర స్వామివారిని విద్యుత్ శాఖ సీజీఎం (విశాఖపట్నం) టీవీఎస్ మూర్తి, దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమీషనర్ (రాజమండ్రి) సుబ్బారావు, దంప తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దీపాలంకరణ అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. బుధవారం క్షీరా రామలింగేశ్వర స్వామివారి ఆలయం భక్తులతో కిట కిటలాడింది.

ఆలయం సమీపంలోని రేపాక వారి సత్రంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సేవా సంస్థ ఆధ్వర్యంలో మూడు వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. సూపరిండెంటెంట్ వాసు, స్వామి, అర్చకులు మల్లిఖార్జునరావు, కిష్టప్ప, పూర్ణయ్య, అనీల్ కుమార్ శర్మ, సోమేశ్వరరావు పాల్గొన్నారు.









లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన రఘురామకృష్ణంరాజు

లోకసభ స్పీకర్ ఓంబిర్లాను అసెంబ్లీ డిప్యూటి స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు కలుసుకున్నారు. ఢిల్లీలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడితో ఓం బిర్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ విషయాలను చర్చించినట్లు సమాచారం. - ఉండి



ఆచార్యులు, విద్యార్థులతో డాక్టర్ చీమలకొండ శ్రీధర్

తరగతి గదిలోనే దేశ భవిష్యత్

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్‌ను తరగతి గది నిర్ణయిస్తుందని తిరుపతి ఐఐటీ కంప్యూటర్స్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగాధిపతి చీమలకొండ శ్రీధర్ అన్నారు. ఆశలను అవకాశాలుగా మార్చుకునే సాధనమే ఆధునిక టెక్నాలజీ అన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎన్‌వీ.రమణారావు, రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగం సహకారంతో బుధవారం కెరియర్ ఇన్ కంప్యూటింగ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగాధిపతి కె.హిమబిందు అధ్యక్షతన సదస్సులో శ్రీధర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను విద్యార్థులు నిశితంగా పరిశీలిస్తే వాటి నుంచే కొత్త ఆలోచనలు పుట్టుకొస్తాయన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్త సాంకేతికతలు ఆవిష్కృతం అవుతున్నాయని, వాటిని నేర్చుకుని పట్టు సాధించిన వారే విజయ శిఖరాలను అధిరోహిస్తారన్నారు. భవిష్యత్ అంతా కృత్రిమ మేధస్సుదేనని, సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించి నైపుణ్యం పెంచుకుంటే ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు భరోసా ఇచ్చిన ముఖ్యమంత్రి

వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు

ఏలూరు రూరల్/భీమవరం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్యోగులకు భరోసా ఇచ్చారని ఏపీ వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు అన్నారు. ఉద్యోగులు సాయంత్రం 6 గంటల తర్వాత కార్యాలయాల్లో పని చేయనవసరం లేదని, పండుగ రోజుల్లో కుటుంబసభ్యులతో గడిపేందుకు, ఆరోగ్య సమస్యలపై ఆసుపత్రులకు వెళ్లడానికి ఉన్న హక్కులను అమలు చేస్తామని ప్రకటించారన్నారు. ఈ మేరకు జిల్లా, ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వాలని రవీంద్ర రాజు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సీఎం ఇచ్చిన కొన్ని ఆదేశాలు కొందరు కిందిస్థాయి అధికారులు అమలు చేయకుండా రాత్రి, పగలు పనులు చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వీఆర్వోలు పనిఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నారని, సచివాలయ సిబ్బందిని సైతం లక్ష్యాల పేరుతో అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇటీవల ఇబ్రహీంపట్నంలో వీఆర్వో ఆత్మహత్యకు పాల్పడ్డాడని గుర్తు చేశారు. ఒక అగ్రికల్చర్ అసిస్టెంట్ ఆత్మహత్యకు పాల్పడడం జరిగిందన్నారు. ఇవన్నీ కూడా పనిఒత్తిడి కారణంగానే జరిగాయన్నారు. సీఎం ప్రకటన వల్ల రాష్ట్రంలో పని చేస్తున్న ఉద్యోగులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు.

జిల్లా మీదుగా రెండు రైళ్ల పొడిగింపు

ఏలూరు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో నడుపుతున్న ప్రత్యేక రైళ్లను మరి కొన్ని రోజులపాటు పొడిగిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఎనిమిది రైళ్ళను డిసెంబర్ నెలాఖరు వరకూ పొడిగిస్తున్నారు. వీటిలో జిల్లా మీదుగా వెళ్లే రెండు రైళ్ళు ఉన్నాయి. రైల్ నెంబర్ 07445 కాకినాడ టౌన్ - లింగంపల్లి (ప్రతి సోమ, బుధ, శుక్ర) డిసెంబర్ 6 నుంచి డిసెంబర్ 30 వరకూ పొడిగింపు. రైల్ నెంబర్ 07446 లింగంపల్లి - కాకినాడ టౌన్ (ప్రతి మంగళ, గురు, శనివారం) డిసెంబర్ 7 నుంచి 31 వరకూ పొడిగింపు. ఈ రెండు రైళ్ళు రాజమండ్రి, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ జంక్షన్ మీదుగా విజయవాడ వెళ్ళనుంది. తిరిగి అదే మార్గంలో వెళ్లనున్నాయి.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం



ధాన్యాభిషేకం చేస్తున్న మంత్రి, రైతులు

చంద్రబాబు చిత్రపటానికి ధాన్యాభిషేకం

చాట్రాయి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని పోలవరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. రైతులు, కూటమి నాయకులతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి ధాన్యాభిషేకం చేశారు. ధాన్యం కొనుగోళ్లు, చెల్లింపులపై మంత్రి రైతులను ఆరా తీశారు. రైతుల దగ్గరికే అధికారులు వెళ్లి కొనుగోలు చేయాలని, ఇబ్బంది రాకుండా పనిచేయాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, పట్టాదారు పాస్ పుస్తకాల సమస్యలను రైతులు మంత్రికి వివరించారు. మంత్రి స్పందించి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశాలు ఇచ్చారు.

ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి : డీఎస్‌వో



నిడమర్రులో మాట్లాడుతున్న డీఎస్‌వో సత్యనారాయణరాజు

నిడమర్రు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తుపాను ముప్పు ఉన్నందున ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్‌ఎస్‌ఎస్. సత్యనారాయణరాజు సూచించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో బుధవారం ధాన్యం సేకరణ పరిస్థితి అంచనా కోసం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ మండలంలో 1096 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా ప్రస్తుతం 400 మెట్రిక్ టన్నులు ధాన్యం మిల్లులకు తోలడం జరిగిందన్నారు. రేపు మిగిలిన 690 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ పూర్తిచేస్తామని ఉన్నతాధికారులకు ఆయన హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎస్‌వో వై.ప్రతాప్‌రెడ్డి, మండల వ్యవసాయ శాఖాధికారి ఎస్.గీతాదేవి రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం

ఐదుగురిపై కేసు

జంగారెడ్డిగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత లక్ష్యంగా రైల్వే, పోస్టల్, మరికొన్ని సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి లక్షలు కాజేస్తున్న ముఠాపై పోలీసులు కేసు నమోదు చేశారు. సుమారు రూ.24లక్షలు కాజేసిన ఐదుగురిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు. పట్టణానికి చెందిన యిచ్చ యామలరావు నుంచి రూ.7.35 లక్షలు, అతని స్నేహితుడు గుర్రం గంగాధరరావు వద్ద రూ. 2.50 లక్షలు, కండెల్లి తేజ నుంచి రూ.8 లక్షలు, దారా నవీన్ నుంచి రూ.9.60 లక్షలు ముఠా సభ్యులైన కదారి హర్షవర్ధన్, పడాల ప్రభాకరరెడ్డి, రాణి, గంజి మురళి, భారతి వసూలు చేశారు. ఎంతకీ ఉద్యోగం రాకపోవడంతో మోసపోయామని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలాఉండగా జంగారెడ్డిగూడెం పట్టణ పరిసర ప్రాంతాల్లో ఈ ముఠా చేతిలో అనేకమంది మోసపోయారని సమాచారం. పోలీసులు విచారించి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

రూ.7.35 లక్షలు తీసుకుని..

ఉద్యోగం ఇప్పిస్తానని లక్షల రూపాయలు దండుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.కె జబీర్ తెలిపారు. బుట్టాయిగూడెంకు చెందిన కదారి హర్షవర్ధన్ నుంచి రైల్వే టీసీ జాబ్ ఇప్పిస్తానని నమ్మించి సుమారు రూ.7,35,000 తీసుకుని ముఖం చాటేశాడని ఎస్ఐ వివరించారు.

సమృద్ధిగా భూగర్భ జలం



● భూగర్భంలో నీరు 4.15 మీటర్లు పెరుగుదల ● సాగునీటి ఇబ్బందులకు చెక్ ● మెట్ట ప్రాంతాలకు శుభవార్త



ఏటా అడుగంటుతున్న భూగర్భ జలాలు ఒక్కసారిగా పెరిగాయి. భూగర్భ జలమట్టం పెరగడంతో సాగు, తాగునీటి ఇబ్బందులు తీరనున్నాయి. మెట్ట ప్రాంతంలో బోర్ల ఆధారంగా సాగు జరుగుతోంది. భూగర్భ జల మట్టం పెరగడం వల్ల తక్కువ లోతు నుంచి నీరు తోడుకునే అవకాశం ఉంది. బోర్ల నుంచి నీరు జలజలాపారుతుంది. మెట్టప్రాంత ఉద్యాన పంటల సాగుకు భూగర్భ జలమట్టం పెరుగుదల మంచి పరిణామం అని చెప్పవచ్చు.

ఏలూరుసిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏటా భూగర్భ జలమట్టం తగ్గుదల ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది గణనీయంగా పెరగడం శుభ పరిణామం. ఏటా వర్షాలు బాగా కురిస్తే ఒకటి నుంచి రెండు మీటర్లు వరకు భూగర్భ జలమట్టం పెరుగుతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్కసారిగా జిల్లాలో 4.15 మీటర్ల వరకు భూగర్భ జలమట్టం పెరగడం సాగునీటి కష్టాలు తీరినట్లే.

గణనీయంగా పెరుగుదల

గత ఏడాది అక్టోబరులో జిల్లాలో 19.37 మీటర్ల లోతుకు భూగర్భజల మట్టం ఉంది. ఈ ఏడాది అక్టోబరులో 15.22 మీటర్లు లోతులోనే భూగర్భ జలం ఉంది. గత ఏడాదితో పోలిస్తే 4.15మీటర్లు వరకు పెరిగాయిని భూగర్భ జలవనరుల శాఖ నివేదికలు చెబుతున్నాయి. జిల్లాలో ఎక్కువ లోతులో అంటే 80.54 మీటర్లు లోతులో కొయ్యలగూడెం మండలంలో నీటిమట్టం ఉంది. ఈ ఏడాది అదే కొయ్యలగూడెం మండలంలో 78.49 మీటర్లు లోతులో నీరుంది. అంటే ఆ మండలంలో భూగర్భజలాలు వృద్ధి చెందాయని చెబుతున్నారు. ముసునూరు, దెందులూరు, నూజివీడు, పెదవేగి, చింతలపూడి, ద్వారకాతిరుమల మండలాల్లో ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలతో గణనీయంగా భూగర్భ జలం పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ముసునూరు మండలంలో 28.12 మీటర్లు వరకు భూగర్భ జలం వృద్ధి చెందింది. దెందులూరు మండలంలో గత ఏడాది 54.31 మీటర్లు లోతులో నీరుండగా ప్రస్తుతం 41.36 మీటర్లలోనే నీరుంది. నూజివీడు మండలంలో గత ఏడాది 36.02 మీటర్లు లోతున నీరుంటే ప్రస్తుతం 33.45 మీటర్లకే నీరు లభ్యమవుతోంది. పెదవేగి మండలం లో గత ఏడాది 35.25 మీటర్లు లోతున, ప్రస్తుతం 30.85 మీటర్లకే నీరు అందుతోంది. చింతలపూడి మండలంలో గత ఏడాది 34.64 మీటర్లు లోతులో ప్రస్తుతం 31.49 మీటర్లకు, ద్వారకాతిరుమల మండలంలో గత ఏడాది 33 మీటర్లు, ప్రస్తుతం 32.50 మీటర్లు లోతున నీరందుతోంది.

80 ఫిజోమీటర్లు ద్వారా సేకరణ

జిల్లాలో ఏటా 80 ఫిజోమీటర్లు ద్వారా భూగర్భ జల వనరుల శాఖ సిబ్బంది నీటిమట్టం వివరాలు సేకరిస్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో భూగర్భ జలం పెరగడం అనూహ్యమైన పరిణామం. భవిష్యత్‌లో పంటల విస్తీర్ణం పెరగడానికి అవకాశం ఉంది. జిల్లాలో సాధారణ పంటలతో పాటు కొత్త రకాల పంటలు సాగు చేయడానికి కూడా అవకాశం ఏర్పడుతుంది. సాగు, తాగునీటి ఇబ్బందులు తీరటం వల్ల జిల్లా సమగ్రాభివృద్ధిలో ముందుకు సాగే అవకాశాలున్నాయి.

విశ్వర్షి వాసిలి రచనలు ప్రశంసనీయం

పెనుగొండ ఎస్‌వీకేపీ కళాశాలలో అంతర్జాతీయ తెలుగు సదస్సు



విశ్వర్షి వాసిలిని సన్మానిస్తున్న నన్నయ వర్సిటీ వీసీ, కళాశాల కరస్పాండెంట్

పెనుగొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశ్వర్షి వాసిలి రచనలు ప్రశంసనీయమని నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి వై.శ్రీనివాసరావు అన్నారు. పెనుగొండలోని ఎస్‌వీకేపీ డాక్టర్ కెఎస్ రాజు ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో అంతర్జాతీయ తెలుగు సదస్సు బుధవారం నిర్వహించారు. విశ్వర్షి వాసిలి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి, యాజమాన్యం బాధ్యతపై పలు సూచనలు ఇచ్చారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ఆచార్యులు వెంకటేశ్వర యోగి మాట్లాడుతూ విశ్వర్షి గురించి వ్యాసం రాయడానికి ప్రయత్నించి 56 ఆత్మ దర్శనాలు రాశానన్నారు. అనంతరం విశ్వర్షి భారతి అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విశ్వర్షి వాసిలిని ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ వైవీ.అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్రాంత తెలుగు అధ్యాపకులు రంకిరెడ్డి రామ్మోహనరావు, కర్రి రామారెడ్డి, ఆదికవి నన్నయ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి వర ప్రసాద్ పాల్గొన్నారు.



విద్యుత్ పోల్‌పై ఉన్న బందెల వసంతరావు

మద్యం మత్తులో విద్యుత్ పోల్‌పై హల్‌చల్

భీమవరం క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఫూటుగా మద్యం సేవించిన వ్యక్తి మత్తులో విద్యుత్ పోల్ ఎక్కి బుధవారం హల్‌చల్ చేశాడు. పోలీసులు తెలిపినవివరాలు ప్రకారం పట్టణానికి చెందిన రిక్షాడ్రైవర్ బందెల వసంతరావు కొంత కాలంగా మద్యం మత్తులో అదే ప్రాంతంలో తిరుగుతున్నాడు. తనను తిట్టారని, కొట్టారని కారణాలు చెబుతూ ఉంటాడు. గతంలో ఐదు సార్లు ఇలాగే విద్యుత్ పోల్స్, సెల్ టవర్‌లు ఎక్కి గందరగోళం సృష్టించాడు. బుధవారం మార్కెట్‌లోని విద్యుత్ పోల్ ఎక్కి హల్‌చల్ చేశాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని అతన్ని కిందికి దిగాలని కోరినా వినలేదు. ఆ ప్రాంతంలో కొన్ని గంటలుగా కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బుధవారం రాత్రికి కూడా అతడు కిందికి దిగలేదు.



రైల్వే గేట్‌ను ఢీకొన్న వ్యాన్

భీమవరం క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉండి రోడ్డులో రైల్వే గేటును డీసీఎం వ్యాన్ డ్రైవర్ వేగంగా ఢీకొట్టడంతో గేటు ధ్వసమైంది. బుధవారం సాయంత్రం రైలు వస్తున్న సమయంలో గేట్‌మెన్ సిగ్నల్ ఇచ్చి గేటు వేస్తుండగా డీసీఎం వ్యాన్ డ్రైవర్ తొందరగా వెళ్లిపోవాలనే కంగారులో గేటును ఢీకొట్టాడు. దీనిపై టౌన్ రైల్వేస్టేషన్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అండర్ సెక్షన్ 154 రైల్వే యాక్ట్ కింద డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ దస్తగిరి తెలిపారు.

లెక్కల టీచర్‌కు షోకాజ్ నోటీస్ జారీ

ద్వారకాతిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల ప్రాథమికోన్నత పాఠశాల లెక్కల టీచర్ ఎంఎస్‌వి ముత్యాలరావుకు డీఈవో షోకాజ్ నోటీసు జారీ చేశారు. 'ఆ టీచరుంటే స్కూల్‌కు వెళ్లం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈనెల 26న ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. టీచర్ ముత్యాలరావు విద్యార్థులను దండించి, దూషిస్తున్నారని ఆరోపణలు రావడంతో ఎంఈవో విచారించారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో ఆయన ప్రవర్తన సరిగా లేదని గుర్తించి డీఈవోకు నివేదిక ఇచ్చారు. ఆయనపై క్రమశిక్షణ చర్య ఎందుకు తీసుకోకూడదో వివరణ కోరుతూ డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. వచ్చేనెల 4న సాయంత్రం 5 గంటలలోపు ఆయన వివరణ కార్యాలయానికి చేరాలని ఆదేశించారు. లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పండుగ రోజున పేరెంట్స్ మీట్?

ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరం

ఏలూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీచర్లకు ప్రభుత్వం కల్పించిన క్యాజువల్ లీవు(సీఎల్స్) వాడుకునే విషయంలో విద్యా శాఖ, ఉపాధ్యాయుల మధ్య ఒకింత ఘర్షణ వాతావరణం కొనసాగుతోంది. తాజాగా డిసెంబరు 7న నిర్వహించ తలపెట్టిన మెగా పేరెంట్స్ మీట్ కూడా వివాదాస్పదమైంది. డిసెంబరు 7న సుబ్రహ్మణ్య షష్టి పండుగ ఉన్నందున అదేరోజు నిర్వహించాల్సిన మెగా పేరెంట్స్ మీట్ వాయిదా వేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. వాస్తవానికి సుబ్రహ్మణ్య షష్టికి పాఠశాలలకు స్థానిక సెలవు (ఎల్‌హెచ్) ప్రకటించుకునే వీలుంది. అదేరోజున అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించాలని విద్యా శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం, విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులివ్వడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి చెప్పడం, విద్యార్థుల క్రమశిక్షణను వివరించడం తదితర అంశాలపై పేరెంట్స్ మీట్ నిర్వహిస్తున్నారు. అదేరోజున పండుగ కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులను సమావేశానికి హాజరుపర్చడం కష్టమని, మరోవైపు ఎక్కువ మంది టీచర్లు కూడా హాజరయ్యే అవకాశాలుండవని చెబుతున్నారు. పేరెంట్స్ మీట్‌ను వాయిదా వేయాలని డీఈవో వెంకట లక్ష్మమ్మను కలిసి అభ్యర్థించేందుకు యూటీఎఫ్, పీఆర్టీయూ జిల్లా నాయకులు ప్రయత్నించగా ఆమె అందుబాటులో లేరు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో కోడ్ కారణంగా డిసెంబరు 10 వరకు పేరెంట్స్ మీట్ నిర్వహించే అవకాశం ఉండదని కూడా భావిస్తున్నారు.

పట్టిసీమ నుంచి 5,310 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు 5,310 క్యూసెక్కుల జలాలు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డీఈఈ పెద్దిరాజు బుధవారం తెలిపారు. గోదావరి నీటిమట్టం 14.074 మీటర్లు నమోదైందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 15 పంపులు 15 మోటార్ల ద్వారా నీటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 25 నుండి ఇప్పటి వరకూ 19.4761 టీఎంసీల నీటిని పోలవరం కుడి కాలువకు విడుదల చేసినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాటగంగానమ్మ లేఅవుట్ కాలనీలో నివాసం ఉంటున్న నైనారపు శ్రీలక్ష్మి (35) మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై ఎస్.కె జబీర్ తెలిపిన వివరాల ప్రకారం నాలుగేళ్లుగా శ్రీలక్ష్మి గర్భాశయ క్యాన్సర్‌తో బాధపడుతోంది. అప్పటి నుంచి వైద్యం చేయించుకుంటూనే ఉంది. వ్యాధి నయం కాకపోవడంతో బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి కుమారుడు నయనారపు వీరాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

పురుగుమందు తాగి యువకుడి మృతి

ఏలూరు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి పురుగుమందు తాగి ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు బుధవారం మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం సుంకరవారి తోటకు చెందిన అజయ్‌కుమార్ (29)కు భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యతో గొడవపడి ఈనెల 26న పురుగు మందు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ట్రాక్టర్ ఢీకొని నలుగురికి గాయాలు

పెదవేగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ వెనుక నుంచి ఢీకొట్టిన ప్రమాదంలో వాహనం నడుపుతున్న భర్త, వాహనంపై ఉన్న భార్య, ఇద్దరు పిల్లలు గాయపడ్డారు. ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు దెందులూరు మండలం నాగులదేవునిపాడు గ్రామానికి చెందిన గుజ్జుల బాబూరావు ఈనెల 25న రాత్రి ఏడుగంటల సమయంలో భార్యా, ఇద్దరు కుమారులతో ద్విచక్ర వాహనంపై కూచింపూడి వెళుతున్నాడు. పెదవేగి సమీపంలో వేగంగా వచ్చిన ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. బాబూరావు, అతని భార్య, ఇద్దరు కుమారులు గాయపడ్డారు. వారిని ఏలూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. తమకు సమాచారం ఆధారంగా కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

క్రైమ్ కార్నర్

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్టు

ఏలూరు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పాత కక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిని చాకుతో పొడిచిన యువకుడిని త్రీ టౌన్ ఎస్ఐ కెప్రసాద్ బుధవారం అరెస్టు చేశారు. ఏలూరులోని విజయగార్డెన్స్ 3వ రోడ్డునకు చెందిన రాయిశివయ్య (29)కి పాలగూడానికి చెందిన మేడిబోయిన ఫణీంద్రకు పాతగొడవలు ఉన్నాయి. ఫణీంద్ర అతని స్నేహితుడు బాలు కలిసి ఈనెల 24న రాత్రి సత్రంపాడు రోడ్డులో శివయ్యను చాకుతో పొడిచారు. ఈ సంఘటనపై త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడైన ఫణీంద్రను బుధవారం త్రి టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు, ఎస్ఐ ప్రసాద్ అరెస్టు చేశారు.

బాలికపై అత్యాచార యత్నం

నిందితుడి అరెస్ట్

పెంటపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ స్వామి తెలిపారు. ఈనెల 26న మండలానికి చెందిన ఒక బాలికపై సమీప బంధువు మహేశ్‌రావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. చుట్టుపక్కల వారు రావడంతో పారిపోయాడు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేసి, బుధవారం నిందితున్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీ

నూజివీడు టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విద్యుత్‌శాఖ ఏడీఈ దుర్గారావు గృహంలో దొంగలు బంగారు ఆభరణాలు దొంగిలించారు. మంగళవారం రాత్రి బీరువాలో 25 కాసుల బంగారాన్ని దొంగిలించినట్లు గమనించిన దుర్గారావు కుటుంబ సభ్యులు సీఐ సత్యశ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం ఘటనా స్థలాన్ని సీఐ పరిశీలించారు. క్లూస్ టీం వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు.

ఈ దారి నాది..!



మార్గంలో అడ్డంగా కట్టిన కర్రలు

నరసాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైఎస్‌పాలెం గ్రామ పరిధిలో వర్ధనపు పేటలో దారి లేదంటూ 14 కుటుంబాలకు మార్గం లేకుండా కర్రలతో అడ్డంగా కట్టాడు. కాలనీవాసులు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఆర్డీవో దాసి రాజుకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ రాజారాజేశ్వరిని ఆర్డీవో ఆదేశించారు. కొంతకాలంగా కాలనీలో స్థలంపై వివాదం జరుగుతుంది. ఇదే పేటకు చెందిన విలియమ్స్ ఆ స్థలం తమదని ఇటువైపు నడవొద్దని కాలనీవాసులతో గొడవపడడంతో గ్రామ పెద్దలు రాజీ ప్రయత్నం చేశారు. వీఆర్వో దృష్టికి కూడా తీసుకెళ్లినా వివాదం పరిష్కారం కాలేదు. ఈనేపథ్యంలో విలియమ్స్ బుధవారం ఉదయం దారికి అడ్డంగా కర్రలు కట్టేశాడు. స్థానికులు మరో మార్గంలో బయటకు వచ్చి విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు.

హనుమాన్ విగ్రహం ప్రత్యక్షం

ఆచంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆచంట వేమవరంలో రోడ్డుపక్కన ఈ నెల 24 అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆంజనేయుడు విగ్రహాన్ని ప్రతిష్ఠించగా ఉదయానికి మాయమైంది. దీనిపై ఆంధ్రజ్యోతిలో హనుమాన్ విగ్రహం మాయం శీర్షికన ప్రచురితమైన కథనంపై గ్రామస్తులు, భజరంగ్‌బల్ నాయకులు స్పందించారు. ఈ సంఘటనపై ఆరా తీయగా విగ్రహం పక్కన ఉన్న స్థలానికి సంబంధించి వ్యక్తి విగ్రహాన్ని మాయం చేసినట్లు గుర్తించారు. అతనితో తిరిగి అదే చోట విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. విగ్రహం ఏర్పాటుచేసిన వారు ఎవరో తెలియకపోయినా తొలగించిన వారిని గుర్తించారు. ఈ సంఘటన గ్రామంలో చర్చనీయాంశమైంది.

అలిగి వెళ్లిపోయింది..!

మహిళను కాపాడిన రైల్వే పోలీసులు

ఏలూరు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడిన మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయింది. రైల్వే స్టేషన్‌లో ఒంటరిగా రోదిస్తున్న ఆ మహిళను రైల్వే పోలీసులు ఆమెను సంరక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. విశాఖపట్నం జిల్లా గాజువాక దగ్గర నిండి గ్రామానికి చెందిన పప్పల నాగసాయి (21) భర్త రమేష్‌తో గొడవపడి ఈనెల 26న ఎవరికి చెప్పకుండా రత్నాచల్ రైలు ఎక్కింది. సాయంత్రం 6 గంటల సమయంలో ఏలూరులో దిగింది. రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై రాత్రి వేళ ఒంటరిగా ఏడుస్తుండగా డ్యూటీలో ఉన్న మహిళా కానిస్టేబుల్ గుర్తించి ఆమెతో మాట్లాడింది. రైల్వే ఎస్ఐ సైమన్‌కు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ అక్కడికి చేరుకుని ఆమెతో మాట్లాడి ఆమె పెదనాన్న కర్రి గోవిందు, అన్నయ్య కర్రి చిరంజీవికి ఫోన్‌లో తెలియజేశారు. దిశ వన్‌స్టాప్ సెంటర్‌లో ఉంచి బుధవారం ఉదయం కౌన్సెలింగ్ ఇచ్చి ఆమె పెదనాన్న, అన్నయ్యకు అప్పగించారు.



అంబులెన్స్‌లో తల్లీ బిడ్డ

108లో ప్రసవం

తల్లీ బిడ్డ క్షేమం

పెనుమంట్ర, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : పొలమూరు గ్రామానికి చెందిన అరుణ దేవి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు 108 అత్యవసర వాహనానికి సమాచారం ఇచ్చారు. పెనుమంట్ర 108 వాహన సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని ఆమెను పీహెచ్‌సీకి తరలిస్తుండగా బ్రాహ్మణ చెరువు సమీపంలో వచ్చేసరికి పురిటి అంబులెన్స్‌లోనే పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ సీహెచ్ బాలకృష్ణ, పైలెట్ జి వెంకట్రావు సహాయం చేశారు. అనంతరం పీహెచ్‌సీకి తరలించగా తల్లి బిడ్డ క్షేమంగా ఉండడంతో అంబులెన్స్‌లో సుఖ ప్రసవం చేసిన సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు నిరుద్యోగ యువతకు ఎమ్మెల్యే ఇంటర్వ్యూలు

చింతలపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అభివృద్ధి పనులు మంజూరు చేయించడంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాల కోసం చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా చింతలపూడి ఆర్‌కె ఫంక్షన్ హాలులో గురువారం స్వయంగా ఎమ్మెల్యే అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గంలో నిరుద్యోగులైన యువతీ యువకులు టెన్త్, డిగ్రీ, ఆపైన చదువుకున్న వారంతా, ఇంగ్లీషు మాట్లాడగలిగిన అనుభవం ఉన్నవారు ధ్రువపత్రాలతో ఈ ఇంటర్వ్యూలకు నేరుగా హాజరుకావచ్చునని తెలిపారు.

నేడు ఎయిడ్స్‌పై పోస్టర్ పెయింటింగ్ పోటీ

ఏలూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్‌పై యువతలో అవగాహన కల్పించే కార్యక్రమాల్లో బాగంగా ఈ నెల 28న ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు 9, 10, ఇంటర్మీడియట్ విద్యార్థులకు 'హెచ్ఐవి/ఎయిడ్స్' ప్రధానాంశంగా పోస్టర్ పెయింటింగ్ పోటీ నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని, ఆసక్తివున్న వారు పోటీలో పాల్గొనాలని కోరారు.

సమాజ సేవకు ఉపక్రమించాలి

స్వామి కృష్ణ చరణానంద భారతి

ఉంగుటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హిందూత్వం ద్వారా సమాజ సేవకు ఉపక్రమించాలని స్వామి కృష్ణ చరణానంద భారతి అన్నారు. బుధవారం నాచుగుంట గోశాల వార్షికోత్సవం సందర్భంగా మహారుద్ర హోమం, గో పూజ అనంతరం భక్తులనుద్దేశించి రాజాశ్రమ పీఠాధిపతి, భారతీయ ధర్మ పరిషత్ జాతీయ అధ్యక్షుడు స్వామి కృష్ణ చరణానంద భారతి ఆధ్యాత్మికోపన్యాసం చేశారు. గోశాల అధ్యక్షుడు జి. సత్యనారాయణ అధ్యక్షత వహించగా విజయవాడ విభాగ్ సంఘ్ చాలక్ కోనేరు దుర్గా ప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

పంచాయతీలో అవకతవకల ఆరోపణలపై విచారణ

ఉంగుటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైకరం పంచాయతీలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై బుధవారం ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారి పూర్ణచంద్రరావు విచారణ జరిపారు. గ్రామానికి చెందిన గంజి ప్రభాకరరావు అప్పటి కార్యదర్శి నాగేంద్రపై ఆరోపణలు చేశారు. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఫిర్యాదు వారిగా ప్రతి ఫైలును పరిశీలిస్తున్నామన్నారు. ఈ విచారణలో ఈవోపీఆర్డీ చంద్రశేఖరన్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి సౌండ్ బాక్సు వితరణ

ఏలూరు టూ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రూ. 15 వేల విలువైన సౌండ్ బాక్సును దాత లు బహూకరించినట్లు గ్రంథాలయ కార్యదర్శి ఎం. శేఖర్ బాబు తెలిపారు. దాతలు ఎస్సై వై.రామ్మోహన్, టీచర్లు ఎం.రాంబాబు, ఏ.నరేష్, కే.రామయ్య, జీ. గోపికిషోర్, ఆర్.వెంకటేశ్వరరావు, జే.నాగరాజు, ఎం.చిట్టిబాబు, ఎం.సాంబశివరావు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కే.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్ల వితరణ

ఏలూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలు ఎన్‌సీసీ కేడెట్లు గౌరవ వందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదేపల్లిరోడ్‌లోని ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమాన్ని, కోటదిబ్బ ప్రభుత్వ దివ్యాంగుల వసతి గృహాన్ని సందర్శించి పండ్లు అందజేశారు. కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, ప్రిన్సిపాల్ సాయికుమారి, ఎన్‌సీసీ ఆఫీసర్ అనంత, రమ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ కళాశాలలో వసతుల పరిశీలన

దెందులూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గోపన్నపాలెం సీతారామ ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కళాశాలలో వసతులు, హాస్టల్ సక్రమంగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్ (మిల్లుబాబు) ఎమ్మెల్యే చింతమనేని దృష్టికి తీసుకువెళ్లడంతో కళాశాలలో వసతులపై నివేదిక ఇవ్వాలని సర్వశిక్ష అభియాన్ ఇంజనీరింగ్ అధికారిణి లలిత కుమారిని కలెక్టర్, చింతమనేని ఆదేశించారు. ఈ నేపథ్యంలో లలితకుమారి బుధవారం కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు నమోదు చేసుకున్నారు. కలెక్టర్‌కు నివేదిక అందిస్తానని లలితకుమారి తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

కుక్కునూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు సీఐ ఎం.రమేష్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం సీతారామనగరం గ్రామ శివారులో సారా తయారీ స్థావరాల పై పోలీసులు దాడి చేసి 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 20 లీటర్ల సారాతో పాటు సారా తయారికి ఉపయోగించే సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేస్తుంటే 94407 96608కి సమాచారం అందించాలని కోరారు.

ఇల్లు దగ్ధం

టి.నరసాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెడ్లం గ్రామానికి చెందిన కాగితాల వెంకటేశ్వరమ్మ వ్యక్తిగత పనుల నిమిత్తం ఇంటికి తాళంవేసి వేరే గ్రామం వెళ్ళింది. ఈ నేపథ్యంలో ఇంట్లో నుండి మంటలు రావడం చూసిన స్థానికులు మంటలు అదుపుచేసే ప్రయత్నం చేశారు. అప్పటికే ఇంట్లో విలువైన సుమారు రూ.లక్ష విలువచేసే సామాగ్రి టి.వి, ఫ్రిజ్ ఇతర గృహోపకరణాలు దగ్ధమయ్యాయని, విద్యుత్ ప్రమాదం వల్లే మంటలు వ్యాపించాయని వారు తెలిపారు. కాలిన ఇంటిని విఆర్‌ఓ ఆంజనేయులు పరిశీలించారు.

ఫెంగల్ బెంగ

ధాన్యం దక్కించుకునేందుకు అన్నదాత పాట్లు



దాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతులు

ఏలూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం వాయుగుండం(ఫెంగల్)గా బలపడింది. వర్షాలు కురుస్తాయని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఏలూరు రూరల్ మండలంలో 16వేల హెక్టార్లకు పైగా ఖరీఫ్‌లో వరిసాగు చేశారు. ప్రస్తుతం పంట కోతదశకు చేరుకుంది. ఈ సమయంలో తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడితే వరిపంట దెబ్బతింటుందని, వరి నేలకు ఒరిగి గింజలు నేలరాలుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో పాలగూడెం, చాటపర్రు, జాలిపూడి, కాట్లంపూడి, పోణంగి, సుంకరవారితోట పరిసర ప్రాంతాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. దాదాపు 20 శాతం కోతలు జరిగాయి. వర్షం రాకపోతే వరిపంటను కోసి ఇంటికి చేర్చుకునే వారమని, ప్రస్తుత తుఫాన్ ప్రభావంతో ఆకాశం మేఘావృతమై ఉండడంతో దిక్కుతోచటం లేదని వాపోతున్నారు. లక్షలు పెట్టుబడులు పెట్టి రాత్రింబవళ్ళు పంటను కాపాడుకుంటూ వచ్చామని తీరా గింజలు ఏర్పడిన తరువాత తుఫాన్ ప్రభావంతో నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కోసిన పంటను ఆరబెట్టే పనిలో నిమగ్నం అయ్యారు. వర్షం వస్తే ధాన్యం నాని నూర్పిడి చేసేటప్పుడు బియ్యపు గింజ విరిగిపోతుందని దీంతో నూక అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా పంట చేతికి వచ్చే సమయంలో తుపాన్ల కారణంగా పంట చేతికి అందకుండా పోతోందని వాపోతున్నారు.

పోలవరం: తుపాను నేపథ్యంలో బుధవారం రైతులు అప్పటికే కోసిన తమ పంటలను ఒబ్బిడి చేసుకునే పనిలో పడ్డారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఎదుట ఖాళీ స్థలంలో ఆరబెట్టిన ధాన్యం రాశులను రైతులు బస్తాలకెత్తి, బరకాలు కప్పి ఒబ్బిడి చేసుకునే పనిలో పడ్డారు. మరి కొందరు రైతులు తమ పంటలను దళారులకు అమ్ముతున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు దళారులు ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

వరి కోతలు నిలిపివేయాలి

బుట్టాయగూడెం/భీమడోలు: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయని తుఫాన్ హెచ్చరికల నేపథ్యం లో వరికోతలను ఐదు రోజులపాటు నిలుపుదల చేయాలని మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు తెలిపారు. పనలమీద ఉన్న పంటను, రాశులు, కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాల్లో భద్రపరచుకోవాలని, ధాన్యం తడవకుండా బరకాలను కప్పి ఉంచాలని తెలిపారు. బుధవారం మండలంలోని దొరమామిడి, లక్ష్మీదుగూడెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడుతూ రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని అమ్మి గిట్టుబాటు ధర పొందాలన్నారు. పూళ్ళ సొసైటీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అధికారులు ధాన్యం కొనుగోలు విధానాన్ని పరిశీలించారు. తుఫాను కారణంగా రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలుపడే అవకాశం ఉండడంతో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు రైతులకు పలు సూచనలిచ్చారు. కోతలు పూర్తి చేసి కల్లాల్లోను, జాతీయ రహదారులపై ఆరబెట్టిన వరి రైతులను కలిసి ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఆర్ఎస్‌కేల నుంచి గోనె సంచులను తీసుకుని ధాన్యాన్ని నింపి తడవని ప్రదేశాలకు తరలించాలన్నారు. అలా వీలులేని రైతులు బరకాలను కప్పి ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని, వర్షాలు తగ్గిన తరువాత కోతలు కోసుకోవాలన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జీలుగుమిల్లి/చింతలపూడి/లింగపాలెం: రాబోయే మూడు రోజుల్లో తుఫాన్ ప్రభావానికి పంటల నష్టపోకుండా రైతులు అప్రమత్తం కావాలని మండల వ్యవసాయాధికారి కె.గంగాధరం అన్నారు. పి.అంకంపాలెంలో పొలం పిలుస్తోంది లో ఆయన మాట్లాడారు. పంట కోతలు నిలుపుదల చేయాలన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో ఫెంగల్ తుఫాను ప్రభావం వలన వర్షాలు పడే సమాచారం ఉన్నందున మండ లంలోని రైతులు వరి కోతలు నిలుపుదల చేయాలని వ్యవ సాయ సహాయ సంచాలకులు నాగకుమార్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వరి పంట వేసిన రైతులు అప్రమత్తంగా ఉండాలని లింగపాలెం మండల వ్యవసాయ అధికారి కోటగిరి మురళీకృష్ణ రైతులను హెచ్చరించారు. రైతులు వరిపంట కోయవద్దని, ఇప్పటికే కోసిన రైతులు ధాన్యాన్ని మెరక ప్రాంతంలో ఉంచాలని తెలిపారు. ధాన్యం తడవకుండా పరదాలను కప్పాలని సూచించారు.

గింజలు రాలిపోతాయి

నేను సాగుచేసిన వరిమడి కోతకు వచ్చింది. ఈ సమయంలో వర్షాలు వస్తే గింజలు రాలిపోతాయని భయంగా ఉంది. కోతదశలో వర్షం వస్తే భూమి ఆరదు, దీంతో పంటకోత కోసేందుకు ఇబ్బందిగా ఉంది. మిషన్‌లు రాకపోవడంతో కూలీలను పెట్టి పంట కోయాల్సి ఉంటుంది. దీంతో ఖర్చులు పెరుగుతాయి.

-బ్రహ్మరెడ్డి మల్కాపురం

ఏటా నష్టపోతున్నాం

5 ఎకరాల్లో వరి సాగు చేశా. మూడు ఎకరాలు కోతలు పూర్తి అయ్యాయి. తుఫాన్ ఉందని వార్త లు రావడంపై ఆందోళనగా ఉంది. వర్షం వస్తే గింజలు దెబ్బతింటాయి. మిగతా పంట వరిమళ్ళ పడిపోతాయి. ఏటా పంటలను నష్టపోతూనే ఉన్నాం.

నరసింహారెడ్డి, పాలగూడెం,



కేంద్ర మంత్రికి పరామర్శ

లింగపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను భీమవరంలోని ఆయన నివాసంలో లింగపాలెం మండల బీజేపీ నేతలు పరామర్శించారు. ఇటీవల ఆయన తండ్రి మరణించిన విషయం విదితమే. పరామర్శించిన వారిలో ఏలూరుజిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్‌కిషోర్, రాష్ట్ర కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు రాయంకుల చక్రధరరావు, కుర్రా సుబ్రమణ్యేశ్వరవరప్రసాద్ ఉన్నారు.



విజిలెన్స్ డీఎస్పీకి అభినందన

భీమడోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏలూరు విజిలెన్సు డీఎస్పీ మేకా సుధాకరరావును బుధవారం భీమడోలు మండల జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. జనసేన నాయకుడు మామిళ్ళపల్లి కాశీబాబు, బీజేపీ నాయకులు సుబ్బారావు, సూరిబాబు, న్యాయవాది కోటేశ్వరరావు డీఎస్పీని సత్కరించారు.

భూమి అన్యాక్రాంతంపై ఫిర్యాదు

ఏలూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలం మఠంగూడెం గ్రామానికి చెందిన దాదినబోయిన చంద్రశేఖర్‌కు చెందిన భూమిని మరో మహిళ పేరుమీద తప్పుడు రిజిస్ట్రేషన్ జరిగిందని, ఈ విషయం పై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జుజ్జువరపు రవిప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వరరావును కలిసి వినతిపత్రం అందచేశారు.

ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు

లింగపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొట్టిన ఘటనలో ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కే వెంకన్న తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం లింగపాలెం మండలం ధర్మాజీగూడెం పంచాయితీ కార్యాలయంలో గ్రేడ్ 5 సెక్రటరీగా పనిచేస్తున్న రాంబాబు విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళుతుండగా లింగపాలెంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైనట్లు ఎస్ఐ తెలిపారు. రాంబాబు ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చిన్నారిపై బాలుడి అత్యాచారయత్నం

దెందులూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక ఒక గ్రామానికి చెందిన చిన్నారిపై అదే గ్రామానికి చెందిన 9 తరగతి విద్యార్థి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు దెందులూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ వెట్రిసెల్వి ఇద్దరూ మైనర్‌లు కావడంతో దెందులూరు ఎంఈవోను విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పోలీసు కేసు నమోదు కావడంతో నిందితుడిని జువైనల్ హోమ్‌లో ఉంచారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

లింగపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ధర్మాజీగూడెం ఎస్ఐ కే వెంకన్న హెచ్చరించారు. మైనర్లు నడిపే వాహనాలతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనదారులు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

రహదారి నిర్మాణం పరిశీలించిన ఎమ్మెల్యే

నిడమర్రు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెదనిండ్రకొలను- ఫత్తేపురం రహదారి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆదేశించారు. బుధవారం పెదనిండ్రకొలను- ఫత్తేపురం రహదారి పనులను ఆయన స్వయంగా పరిశీలించి సూచనలు చేశారు. గాంధీభవన్ వద్ద రోడ్డు పై ఉన్న చెత్తాచెదారాలను, ఆక్రమణలను తొలగించాలని సూచించారు. ఫత్తేపురం ఉపసర్పంచ్ రుద్రరాజు వెంకటేశ్వరరాజు, అధికారులు పాల్గొన్నారు.

పోలీసు కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనమే : సీఐ

ఏలూరు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పోలీసు కేసుల్లో ఇరుక్కుంటే వారి బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని, ఉద్యోగ అవకాశాలు కూడా ఉండవని, విదేశాలకు వెళ్ళడానికి పాస్‌పోర్టు మంజూరు కాదని ఏలూరు త్రీ టౌన్ సీఐ ఎస్. కోటేశ్వరరావు అన్నారు. ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌ను సీఐ సిబ్బందితో కలసి నిర్వహించారు. విద్యార్థులు వారి తల్లి దండ్రుల ఆశయ సాధనకోసం కష్టపడి చదవాలని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. పలు ప్రాంతాల్లో విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

వసతి గృహాలకు నూతన భవనాలు నిర్మించాలి

బుట్టాయగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ వసతి గృహాలకు నూతన భవనాలు నిర్మించాలని కోరుతూ బుధవారం కేఆర్ పురం ఐటీడీఏ వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. అనంతరం ఏపీవో, డీడీ పీవీఎస్ నాయుడుకి వినతిపత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు బన్నె వినోద్ మాట్లాడుతూ మండల కేంద్రంలో బాలుర వసతి గృహంలో సదుపాయలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బాలికల కళాశాల వసతి గృహంలో ఇవే సమస్యలు ఉన్నాయని అధికారి దృష్టికి తీసుకువెళ్ళారు.

దోమల వల్లే జ్వరాలు

ఏలూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నీటినిల్వ ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెంది దోమకాటువల్ల జ్వరాలు విజృంభించడానికి కారణమవుతున్నాయని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు హెచ్చరించారు. స్థానిక మోతేవారి తోట అర్బన్ పీహెచ్‌సీ పరిధిలోని ఎరుకల కాలనీలో బుధవారం శీతాకాలంలో వ్యాప్తిచెందే వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న క్రాఫ్ సంస్థ సభ్యులు

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు : కలెక్టర్

ఏలూరు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి చెప్పారు. బాల్య వివాహాల నియంత్రణకు సంబంధించిన దేశ వ్యాప్త కంప్లైంట్ పోర్టల్‌ను బుధవారం ఆన్లైన్ ద్వారా కేంద్ర మహిళా భివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించి అన్ని రాష్ట్రాల నుంచి బాల్య వివాహాలకు గురికాకుండా రక్షింపబడిన బాలికల తో కేంద్ర మంత్రి ఇంటరాక్ట్ అయ్యారు. ఈ సంద ర్భంగా గత ఏడాది బాల్య వివాహం నిలుపుదల చేసి చదువు కొనసాగిస్తున్న ఏలూరు జిల్లా పెదవేగి మండలం కొప్పాక గ్రామంనకు చెందిన బాలిక తాను బాల్య వివాహం నుంచి ఎలా రక్షింప బడిందీ, భవిష్యత్తులో తాను ఏం అవ్వాలను కుం టుందీ వివరించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లి దండ్రులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు రీత్యాగాని వేర్వేరు కారణాలతో బాల్య వివాహాల సమస్యను ఎదుర్కొంటున్న బాలికలు ఎవరైనా కూడా ధైర్యంగా ముందుకు వచ్చి తమను తాము రక్షించుకోవడానికి 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేసి సమాచారం ఇస్తే వెంటనే రక్షంచడం జరుగుతుందన్నారు. బాలికలకు వివాహానికి చట్టపరమైన అర్హత వయస్సు వచ్చేంతవరకు తమ పిల్లలకు వివాహం చేయవద్దని తల్లి దండ్రులకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మావతి, పెదపాడు ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి, డీసీపీవో సూర్యచక్రవేణి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం మల్కాపురం గ్రామంలో బుధవారం రాత్రి చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు క్రాఫ్ కో-ఆర్డినేటర్ ఆర్.వినోద్ కుమార్, జి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో బాల్య వివాహాల్ని అరికడదాం అనే నినాదంతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేయించారు. మల్కాపురం సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

స్టడీ సర్కిళ్ళకు పూర్వ వైభవం

ఏలూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గతంలో ఒక వెలుగు వెలిగి ఎందరికో దిక్సూచిగా నిలిచిన బీసీ స్టడీ సర్కిళ్ళకు మళ్ళీ పూర్వవైభవం దిశగా సాగనుంది. వైసీపీ హయాంలో నిధుల కొరత, నిర్లక్ష్యంతో బీసీ యువతకు దూరమైన శిక్షణా కార్యక్రమాలు మళ్ళీ ప్రారంభం కానున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్షలో రాష్ట్రంలోని బీసీ స్టడీ సర్కిళ్ళకు రూ.10 కోట్లు నిధులు విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లాలో యువతకోసం ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌కు రూ.25నుండి రూ.35లక్షల్లోపు నిధులు విడుదల అయ్యే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నిధులతో ఇక నుంచి యేటా డీఎస్సీ, పోలీస్ ఉద్యోగాలు, బ్యాంకు, గ్రూపు, ఇతర పరీక్షలకు ఇక్కడ నిష్ణాతులైన అధ్యాపకులతో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు యోచిస్తున్నారు. ప్రస్తుతం ఏలూరులో ఫ్రీ రెంట్ భవనంలో ఉన్న స్టడీసర్కిల్‌కు సొంత భవనం కోసం కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎమ్మెల్యే చొరవతో తొలగిన విద్యార్థుల ఇబ్బందులు

పెదవేగి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఉంటుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఏలూరు నుంచి పెదవేగి మండం వంగూరు, కవ్వగుంట, జగన్నాధపురం వెళ్ళే ఆర్టీసీ బస్సులో బుధవారం రాత్రి ఏడుగంటల సమయంలో వెళ్తున్న విద్యార్థులతో ఎమ్మెల్యే ముచ్చటించడంతో విద్యార్థులు బస్సు చాలా ఆలస్యంగా వస్తుందని, దీంతో కళాశాలల నుంచి బస్టాండ్‌కు వచ్చిన తరువాత గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని విద్యార్థులు తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రభాకర్ ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. ఎమ్మెల్యే సూచనలతో స్పందించిన ఆర్టీసీ అధికారులు విద్యార్థులకు సౌకర్యంగా ఉండేలా సమయానుకూలంగా బస్సులు నడిచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మిర్చి రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

లింగపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మిర్చి రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు, పంటల సస్యరక్షణ, తెగుళ్ల నివారణపై అవగాహన కలిగి ఉండాలని ఏడీఏ బీ నాగకుమార్ అన్నారు. ధర్మాజీగూడెంలో బు ధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వ హించారు. పంటలను నష్టపరిచే రసం పీల్చు పురుగు, కాయతొలుచు పురుగుల నివారణకు ఏవిధమైన పురుగు మందులు వాడాలో రైతులకు తెలియజేశారు. ఉద్యాన శాఖ అధికారి షాఫియా ఫర్హీన్, మండల వ్యవసాయ అధికారి మురళీకృష్ణ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు

పెదవేగి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 132 కేవీ భీమడోలు-పెదవేగి ఫీడర్‌లో కండక్టర్ (విద్యుత్ వైరు) మార్పు చేస్తున్న నేపథ్యంలో వచ్చే నెల 23 వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు చేశామని ట్రాన్స్‌కో ఏలూరు ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. కండక్టర్ మార్పు పూర్తయ్యే వరకు విద్యుత్ సరఫరా రెండు విడతలుగా చేస్తామన్నారు. పెదవేగిలోని 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విజయరాయి, బాపిరాజుగూడెం, జానంపేట, పెదవేగి, కూచింపూడి, రామశింగవరం, రాయన్నపాలెం, ముండూరు, కవ్వగుంట, అయ్యపరాజుగూడెం, ధర్మాజిగూడెం, ఆసన్నగూడెం, గాలాయగూడెం, జోగన్నపాలెం, గుడిగుంట, చొదిమెళ్ళ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో మార్పులు ఉంటాయని ఆయన వివరించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కవ్వగుంట విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా 29వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ట్రాన్స్‌కో ఏలూరు ఈఈ కేఎం.అంబేడ్కర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు కవ్వగుంట విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని కవ్వగుంటతో పాటు వెంకట కృష్ణాపురం, గార్లమడుగు, వంగూరు, లక్ష్మీపురం, జగన్నాథపురం తదితర గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మద్యం షాపు ఏర్పాటుపై స్థానికుల ఆందోళన

కామవరపుకోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కామవరపుకోట చెక్‌పోస్టు సెంటర్ దుర్గమ్మ ఆలయ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని నిరసనలు తెలిపినా ఏర్పాటు చేయడంపై బుధవారం స్థానికులు ఆ బెల్టు షాపు వద్ద ఆందోళన నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు మాట్లాడుతూ వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

కామవరపుకోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆడమిల్లి సర్పంచ్ గూడపాటి కేశవరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందచేసేందుకు ఉపయోగపడే విధంగా కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని, విద్యార్థులు వినియోగించుకుని సత్ఫలితాలు సాధించాలన్నారు. జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పోటు ప్రసాద్ మృతికి సీపీఐ సంతాపం

కామవరపుకోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ ఖమ్మం జిల్లా సమితి కార్యదర్శి పోటు ప్రసాద్ మృతికి బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద సంతాప సభను నిర్వహించారు. ప్రసాద్ చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కమ్యూనిస్టు పార్టీకి అంకిత భావంతో సేవలు అందించిన మహనీయుడు ప్రసాద్ అని నివాళులర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

భీమడోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ బాలల ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గుండుగొలను హైస్కూలు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నగర విద్యా శాఖ అధికారి భాస్కర్‌కుమార్ పరిశీలించారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధుల నివారణకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు.



చింతలపూడిలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి





జర్నలిస్టుల వనసమారాధన కార్యక్రమంలో జర్నలిస్టులతో ఎమ్మెల్యే చింతమనేని.. మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

వన సమారాధనల సందడి

- వనసమారాధనలో పాల్గొనడం ఆనందంగా ఉందన్న మంత్రి సారథి
- జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామన్న ఎమ్మెల్యేలు చింతమనేని, బడేటి చంటి

చింతలపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక వన సమారాధనలో పాల్గొనడం ఆనందంగా ఉందని గృహ నిర్మాణ సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన కార్తీక వన సమారాధనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, నియోజక వర్గ జనసేన ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, జగ్గవరపు ముత్తారెడ్డి ప్రసంగించగా మంత్రిని, ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌ను కార్యకర్తలు సత్కరించారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం..

ఏలూరు టూ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి నిరంతరం శ్రమించే జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గవరవరంలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో బుధవారం జర్నలిస్టుల కార్తీక వనసమారాధనలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడుతూ జర్నలిస్టులకు మూడు సెంట్ల ఇళ్ళ స్థలాన్ని కేటాయిస్తామన్నారు. జడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీప్రసాద్, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం, ఐజేయూ సభ్యులు జీవీఎస్ఎన్ రాజు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాగిత మాణిక్యరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేపీ కృష్ణకిషోర్, బి. కృష్ణకిశోర్, సీనియర్ జర్నలిస్ట్ జి. రఘురామ్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా వన భోజనాలు

బుట్టాయగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెడ్డిగణపవరం చెరువుగట్టుపైన ఉన్న కట్టమాలక్ష్మమ్మ గుడి వద్ద బుధవారం కులమతాలకతీతంగా భారీ వనసమారాధన జరిగింది. అనంతరం ఉసిరి చెట్టు వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పర్యాటకం

కొల్లేరు కిలకిల



నత్తకొట్టు (ఓపెన్ బిల్ స్టాక్)

ఈ పక్షులు చిన్న చిన్న నీటి కుంటల్లో, పంటపొలాల్లో గుంపులు గుంపులుగా కనిపిస్తుంటాయి. ఇవి మట్టిలో ఉండి అనేక క్రిమికీటకాలను ఆహారంగా తీసుకుంటూ ఉంటాయి. పంటపొలాల్లోని నేలల్లో ఉన్న క్రిములను తినడం వల్ల ఆ పంటలకు ఎంతో మేలు చేస్తుంది. అలాగే ఇవి నత్తలను వేటాడి ఆహారంగా తీసుకుంటాయి. ఇవి కొల్లేరు సరస్సులో అనేకచోట్ల కనువిందు చేస్తుంటాయి.



గూడబాతు (పెలికాన్)

120 నుంచి 150 సెంటీమీటర్లు పొడవు సుమారు 6 కేజీల బరువు ఉంటుంది. ఇది ప్రధానంగా తెలుపు రంగులో ఉండి బూడిద రంగులో తల, ఈ పక్షులకు విస్తరించదగిన గొంతు సంచులుంటాయి. వీటి సహాయంతో ఇవి నీటి ఉపరితలం నుంచి చేపలను గరిటె వలే పట్టుకుంటాయి. సుమారు 2 కేజీల చేపను సైతం ఒక్కసారిగా తినగలిగే సామర్థ్యం ఉంది. ఇవి చెట్లలో గూళ్ళను పెడతాయి. ప్రతీ సంవత్సరం అవే చెట్లకు వలస వస్తుంటాయి. ప్రతీ సంవత్సరం సెప్టెంబరు నెలలో గూళ్ళ నిర్మాణం చేసుకొని అక్టోబరు, నవంబరు నెలల్లో 2 లేక 3 గుడ్లు పెట్టి సంతానోత్పత్తి చేసుకుంటాయి. 3 నెలల అనంతరం పిల్లలతో సహా విదేశాలకు తరలివెళ్తాయి.



నల్లకంకణాల పిట్ట (బ్లాక్ ఐబిస్)

నల్లకంకణాల పిట్ట 68 సెంటీమీటర్ల పొడవు ఉంటుంది. కిందకి వొంపు తిరిగి నల్లటి దృఢమైన ముక్కు కలిగి ఆకుపచ్చ, వంగ రంగు ఛాయతో నిండు గోధుమరంగుతో ఉంటుంది. ఇది చిత్తడి నేలలు, చెరువులు, పొలాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఇది కొల్లేరు అభయారణ్యంలోనే గాక పంటపొలాల్లోను వేటాడుతూ జీవిస్తుంటుంది.

వలస పక్షులతో కళకళ..

కొల్లేటి పక్షులు.. చూసేకొద్దీ చూడాలనిపించే అందం వాటి సొంతం.. ఒకటి కాదు..రెండు కాదు.. రకరకాల పక్షులు ఏటా ఖండాంతరాలు దాటి కొల్లేరు తీరానికి చేరతాయి.. కొల్లేరులో చేపలను వేటాడి తింటాయి.. ఇక్కడే సంతానోత్పతి చేసుకుంటాయి.. కొల్లేటి పక్షుల కిలకిలారావాలతో ప్రకృతి పులకరిస్తుంది... పర్యాటకుల మనసు పరవశిస్తుంది.. ఏటా శీతాకాలంలో ఇక్కడకు వందల సంఖ్యలో విదేశీ పక్షులు వస్తుంటాయి. పర్యావరణ ప్రేమికులను రారమ్మని ఆహ్వానిస్తుంటాయి.. కొల్లేరుకు వచ్చే కొన్ని పక్షుల గురించి తెలుసుకుందాం..

కైకలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతిపెద్ద రెండో మంచినీటి సరస్సు కొల్లేరు... స్వదేశీ, విదేశీ పక్షుల విడిది కేంద్రం. ఇక్కడ 185 రకాల పక్షులు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. వీటిలో అత్యధికంగా వలస పక్షులుగా పేరొందిన పెలికాన్, పెయింటెడ్ స్టాక్స్ ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. కొల్లేరు సరస్సులో ఆటపాక పక్షుల కేంద్రానికి సైబీరియా, ఆస్ట్రేలియా, కెనెడా తదితర దేశాల నుంచి వేల కిలోమీటర్ల ప్రయాణించి ప్రతీ సంవత్సరం నవంబరు నెలలో వలస వస్తుంటాయి. పెలికాన్, పెయింటెడ్ స్టాక్ పక్షులు కొల్లేరుకు తరలివచ్చేది ప్రధానంగా సంతానోత్పత్తి చేసేందుకే. ఎర్రకాళ్ళ కొంగ (పెయింటెడ్ స్టాక్), గూడబాతు (పెలికాన్), గుడ్డికొక్కిరాయి (సాండ్ హిరాయిన్), కేపరాయి (గ్రే హెరాయిన్), నత్తకొట్టు (ఓపెన్ బిల్ స్టాక్) పక్షులు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

పర్యాటక అభివృద్ధికి మరింత కృషి



కొల్లేరులో పక్షులను తిలకించేందుకు పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అదనంగా మరో అధునాతన బోటు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్ప టికే రెండు ఉన్నాయి. మూడో బోటు కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు చేశాం. పక్షుల ఆవాస కేంద్రాలు ఏర్పాటు చేసుకునేందుకు మరో 20 కృత్రిమ ఐరన్ స్టాండ్లను మార్చి నాటికి ఏర్పాటు చేస్తాం.

-నాగలింగాచార్యులు, అటవీశాఖ రేంజర్, కైకలూరు

వైట్ పెలికాన్



ఇది అరుదైన పక్షి. కొల్లేరు సరస్సుకు అప్పుడప్పుడు వలస వచ్చే ఈ అరుదైన పక్షి పేరు వైట్ పెలికాన్. ఇవి కొల్లేరుకు వచ్చే సమయంలో 4 లేదా 5 పక్షులు మాత్రమే అటవీశాఖ అధికారులకు కనిపిస్తుంటాయి. కొద్దిరోజులలోనే మరో ప్రదేశానికి తరలి వెళ్తుంటాయి. ఇది సుమారుగా 5 నుంచి 9 కేజీల బరువు ఉంటుంది. ఈ పక్షి 130 నుంచి 180 సెంటీమీటర్లు పొడవు కల్గి ఉంటుంది.

జమ్ముకోడి



ఈ పక్షి చిత్తడినేలలు, గడ్డి ప్రాంతాల్లో చిన్న నీటి మడుగుల్లో జీవిస్తుంటుంది. ఇది భారతదేశంలో అనేక రాష్ట్రాల్లో చిన్న చిన్న నీటి మడుగుల వద్ద కనిపిస్తుంటుంది. ఇది చూసేందుకు చాలా అందంగా కనిపిస్తుంది.

ఆటపాక వెళ్లాలంటే..

కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రానికి చేరుకునేందుకు రోడ్డు, రైల్వే మార్గాల ద్వారా చేరుకోవచ్చు. విజయవాడ, భీమవరం నుంచి వచ్చే వారు రైలు, బస్సు ద్వారా కైకలూరు చేరుకోవాలి. అలాగే ఏలూరు, భీమవరం, గుడివాడ నుంచి బస్సులకు వచ్చేవారు కైకలూరులో దిగి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పక్షుల కేంద్రానికి ఆటోల ద్వారా చేరుకోవచ్చు. ఆటపాకలో పక్షుల కేంద్రానికి చేరుకునే రహదారికి అటవీశాఖ అధికారులు మార్గాన్ని చూపుతూ బోర్డు ఏర్పాటు చేశారు.



పెయింటెడ్ స్టాక్ (ఎర్రకాళ్ళ కొంగ)

దీని పేరు ఎర్రకాళ్ళ కొంగ. తెల్లటి రెక్కలపై గులాబి రంగు, కాళ్ళపైన ఎరుపు, వీపు మీద నలుపు, గోధుమరంగులో ముక్కు. చిత్రకారుడు గీసిన చిత్రంలా కొల్లేరులో దర్శనమిస్తుంటుంది. పిల్ల దశలో ముక్కు నల్లగా రెక్కలు నలుపు రంగులోనూ ఉంటాయి. పెద్దదయ్యే సమయానికి పైరంగులు పోలి ఉంటుంది. పక్షుల కేంద్రంలో ఎక్కడ చూసినా గూళ్ల నిర్మాణం చేసుకుని సంతానోత్పత్తి చేసుకునే దృశ్యాలు కనిపిస్తుంటాయి.

గ్రే హెరాయిన్ (నారాయణ పక్షి)



ఈ పక్షికి ముక్కు పసుపురంగులో, తల తెల్లగానూ, నల్లటి ఈకలతో పొడవైన మెడతో పొట్టపై నల్లని మచ్చలతో ఉంటుంది. ఈ పక్షి సుమారుగా 90 నుంచి 98 సెంటీమీటర్ల పొడవు ఉంటుంది. ఈ పక్షి ఆహారం కోసం ఎంతసేపైనా ఒంటరిగా నిరీక్షిస్తుంది.



నల్లరెక్కల ఉల్లంకి పిట్ట

ఈ పక్షి ఎత్తు 35 నుంచ౦ 40 సెంటీమీటర్లు ఉంటుంది. నలుపు, తెలుపు రంగులో ఉండి నాజూకుగా కనిపిస్తుంది. పొడవైన గులాబిరంగు కాళ్లు.. నిటారైన చక్కని ముక్కు, ఎగురు తున్నప్పుడు పైరెక్కలు నల్లగాను కాళ్ళు తోకకన్నా పొడవుగా వెనుక ఉంటాయి. పిల్ల దశలో లేతపసుపు రంగు అంచులతో గోధుమరంగు పైభాగాలు కలిగి ఉంటుంది. ఇవి ఎక్కువగా చిత్తడి నేలల్లో, నీటి కుంటల్లో, చెరువుల్లో తక్కువ లోతు నీటి సాంద్రత ఉన్న ప్రదేశాల్లో జీవిస్తుంటుంది.

పాముబాతు పక్షి (డార్టర్)



ఈ పక్షి పొడవైన మెడ, నాజూకైన తల, పదునైన ముక్కు, పొడవైన తోక కలిగి ఉంటుంది. ఇది శరీరంలో చాలా భాగం నీటిలో మునిగి తరచుగా ఈదుతూ కన్పిస్తుంది. ఎక్కువగా రెక్కలను ఆరబెడుతున్నట్లుగా చాచి ఉంటుంది. ఎదిగిన పక్షి మెడ కింద తెల్లటి చార, భుజభాగాల్లో తెల్లటి చారలు కల్గి ఉంటుంది. కొల్లేరు సరస్సు, నీటి మడుగులు, నెమ్మదిగా ప్రవహించే నీటి ప్రవాహాల మధ్య మాటు వేసి చేపలను వేటాడుతుంది.

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం

చంద్రబాబు చిత్రపటానికి ధాన్యాభిషేకం



ధాన్యాభిషేకం చేస్తున్న మంత్రి, రైతులు

చాట్రాయి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని పోలవరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధ వారం ఆయన పరిశీలించారు. రైతులు, కూటమి నాయకులతో కలిసి చంద్రబాబు చిత్ర పటానికి ధాన్యాభిషేకం చేశారు. ధాన్యం కొనుగో ళ్లు, చెల్లింపులపై మంత్రి రైతులను ఆరా తీశారు. రైతుల దగ్గరికే అధికారులు వెళ్లి కొనుగోలు చేయాలని, ఇబ్బంది రాకుండా పనిచేయాలని సూచించారు. మండలంలో ఇప్పటివరకు 8273 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.14.50 కోట్లు రైతులకు చెల్లించినట్లు ఏడీఏ విద్యాసాగర్, చాట్రాయి ఏవో శివశంకర్ తెలిపారు. వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, పట్టాదారు పాస్ పుస్తకాల సమస్యలను రైతులు మంత్రికి వివరించారు. మంత్రి స్పందించి సం బంధిత అధికారులకు మంత్రి ఆదేశాలు ఇచ్చా రు. టీడీపీ నాయకులు మోరంపూడి శ్రీనివాస రావు, మరిడి చిట్టిబాబు, బొట్టు లక్ష్మణరావు, కల కొండ భాస్కరరావు, చాగంటి బుచ్చిబాబు, కందుల కృష్ణ, నక్కా రాము, సుబ్రమణ్యం, మారేష్, రైతులు పాల్గొన్నారు.

కోటపాడులో మామిడి రైతుల సదస్సు



మామిడి తోటలో అధికారుల క్షేత్ర పరిశీలన

చాట్రాయి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మామిడి సాగులో మేలైన యాజమాన్య పద్ద తులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని మామిడి పరిశోధన స్థానం అధి కారి రాధారాణి, ఉద్యానశాఖ అధికారి హేమ అ న్నారు. కోటపాడులో బుధవారం మామిడి రైతుల సదస్సు నిర్వహించారు. సాగు యాజ మాన్యం, తెగుళ్ళ నివారణపై రైతులకు అవగా హన కల్పించారు. చెట్టుపై మామిడి కాయలకు తొడిగే కవర్లు రాయితీపై ఇస్తున్నామని, మామి డికి బీమా సదుపాయం రైతులు వినియోగించు కోవాలని కోరారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఆగిరిపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్ర మత్తం కావాలని, మూడు రోజుల పాటు వరికో తలు కోయవద్దని ఏవో పలగాని చెన్నారావు సూ చించారు. ఇప్పటికే పనలపై ఉన్న వరిని కుప్ప లు వేసుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, మిల్లులకు తరలించాలన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించిన ఏవో రైతులకు ధాన్యం నిల్వ పద్ధతులపై అవగాహన కల్పించారు. కోసిన వరిని పొలంలోనే కుప్పలు వేసి వర్షపు నీరు చేరకుండా చుట్టూ కందకాలు తీసుకోవాలని సూచించారు. వీఏఏ. వెంకటలక్ష్మి, సతీష్ పాల్గొన్నారు.

బంగారం చోరీ

నూజివీడు టౌన్, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలో విద్యుత్‌శాఖ ఏడీఈ దుర్గారా వు గృహంలో దొంగలు బంగారు ఆభరణాలు దొంగిలించారు. మంగళవారం రాత్రి బీరువాలో 25 కాసుల బంగారాన్ని దొంగిలించినట్లు గమనించిన దుర్గారావు కుటుంబ సభ్యులు సీఐ సత్యశ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం ఘటనా స్థలాన్ని సీఐ పరిశీలించారు. క్లూస్ టీం వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు.

పాతకక్షల నేపథ్యంలో దాడి

ముసునూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో దాడిచేసి తీవ్రంగా గాయ పరిచిన సంఘటనపై ముసునూరు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై ఎం.చి రంజీవి తెలిపిన వివరాల ప్రకారం అక్కిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన జక్కుల వెంకట సుధీర్ ఈనెల 23న మోటారు సైకిల్‌పై వెళు తుండగా అదే గ్రామానికి చెందిన బజారు రాజేష్ కర్రతో దాడిచేశాడు. తీవ్ర గాయాలైన వెంకట సుధీర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నాడు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు న మోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్టు షాపుపై ఎక్సైజ్ దాడి

ముసునూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుళ్ళపూడిలో బెల్టుషాపు నిర్వహిస్తున్న మహి ళపై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య ఆధ్వర్యంలో జరిగిన దాడిలో ఆమె వద్ద 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్ఐ వై.ఈశ్వర రావు, ఎం.ప్రసాద్, కానిస్టేబుల్స్ కె.వెంకటేశ్వర రావు, ఎస్.వెంకటేశ్వర్లు, వీరయ్య పాల్గొన్నారు.

● చాట్రాయి: మండలంలో చీపురుగూడెం, పర్వతాపురం గ్రామాలకు చెందిన సారా కేసుల్లో పాత నిందితులు నలుగురుని బుధవారం ఎక్సైజ్ పోలీసులు తహసీల్దార్ ప్రశాంతి ఎదుట హాజరు పర్చారు. మరోసారి పట్టుబడితే శిక్ష కఠినంగా ఉంటుందని తహసీల్దార్ కౌన్సెలింగ్ ఇచ్చారు.

అన్నదాత ఉరుకులు పరుగులు

ముదినేపల్లి/కైకలూరు/కలిదిండి, నవం బరు 27 (ఆంధ్రజ్యోతి) : తుపాను హెచ్చరి కలతో మండలంలో వరి కోతలు నిలిపేసి, పన మీద ఉన్న కోసిన వరి పైరును ఒడ్డుకు చేర్చుకునేందుకు, ఆర బెట్టిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవ కాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చ రికలు జారీ చేస్తున్న నేపథ్యంలో పొలాల్లోని వరి పంట చేతికి దక్కుతుందా లేదా అన్నది రైతులకు ఆందోళన కలిగి స్తోంది. యంత్రా లతో కోతలు నిర్వహించి ధాన్యాన్ని రాశు లుగా చేస్తున్నా వాతావరణం మబ్బులుగా ఉండటంతో తేమ శాతం తగ్గించేందుకు ధాన్యాన్ని ఆరబెట్టుకునే అవకాశం లేకుండా పోయింది.

జాగ్రత్తలు పాటించాలి..

వరి రైతులు మరో మూడు రోజుల పాటు కోతలు కోయకుండా జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఆర్ గంగాధరరావు అన్నారు. బుధవారం కైక లూరు మండలం రాచపట్నం, తామరకొల్లు, వేమవరప్పాడు, వింజరం గ్రామాల్లో వరి కోతలను, ధాన్యం రాసులను ఇన్‌చార్జి తహసీల్దార్ ఇబ్రహీంతో కలిసి పరిశీలిం చారు. మండల వ్యవసాయాధికారిణి ఆర్.దివ్య, వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తం కావాలి

తుఫాన్ నేపథ్యంలో వరి సాగు రైతులు అప్రమత్తం కావాలని మండల వ్యవసా యాధికారి విద్యాసాగర్ అన్నారు. కోరుకొల్లు, సానారుద్రవరం, గోపాలపురం, వెంకటా పురం గ్రామాల్లో బుధవారం వరి పొలాలను పరిశీలించారు. వరి కోతలను మూడు రోజులు వాయిదా వేసుకోవాలని, కళ్లాల్లోని ధాన్యాన్ని సురక్ష ప్రదేశాలకు తరలించాలని, మిషన్ల ద్వారా కోసిన ధాన్యాన్ని తడవకుండా మిల్లులకు చేర్చుకోవాలని సూచించారు.



వినియోగదారుల ఫిర్యాదులను తీసుకుంటున్న చైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానియేలు

'అదాలత్‌తో విద్యుత్ సమస్యల పరిష్కారం'

కైకలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించేందుకే స్థానికంగా అదా లత్‌ను నిర్వహిస్తున్నట్లు కన్స్యూమర్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ ఫోరమ్ చైర్‌పర్సన్ ఎన్.విక్టర్ ఇమ్మా నియేల్ అన్నారు. కైకలూరు సీతారామ ఫంక్షన్ హాలులో బుధవారం విద్యుత్ వినియోగ దారుల అవగాహన సదస్సు, అదాలత్ సదస్సును నిర్వ హించారు. ఆయన మాట్లాడుతూ ఆరు జిల్లా లకు ఒక కేంద్రంగా విజయవాడలో సీజీఆర్ఎఫ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారని, విద్యుత్ వినియోగదారులు వారి సమస్యలను ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. గత ఆరు నెలల్లో 150 ఫిర్యా దులు వచ్చినట్టు తెలిపారు. మత్స్యశాఖ ద్వారా అనుమతులు తీసుకువస్తే ఆక్వా రాయితీలు వర్తింపు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కువ విద్యుత్ బిల్లులు వచ్చినా వారి సమస్యలు పరిష్కరించారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ సత్యానందం, సభ్యులు కె.వెంకటకృష్ణ, ఆర్. సీహెచ్ శ్రీనివాసరావు, ఎ.సునీత పాల్గొన్నారు.



మండవల్లిలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి లక్ష్మీ

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మండవల్లి నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలు తల్లిదండ్రులు గుర్తించాలని లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ న్యాయమూర్తి వీవీఎన్‌వీ లక్ష్మీ పేర్కొన్నారు. మండవల్లి వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. ప్యానెల్ లాయర్స్ పి.పవన్‌కాంత్, పి.ప్రసన్నకుమార్, డి.శివప్రసాద్, సీడీపీవో సూపర్‌వైజర్ లక్ష్మీ ప్రసన్న, హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణంరాజు, అంగన్వాడీ టీచర్స్ ఆశా వర్కర్, డ్వాక్రా మహిళలు, మండల లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పశు పోషక రైతులకు సూచనలు ఇవ్వాలి

మండవల్లి నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పశుపోషణ రైతులకు అవసరమైన సల హాలు సూచనలు అందించేందుకు పశు వైద్య అధికారులు అందుబాటులో చొరవ చూపాలని జేసీ ధాత్రీ రెడ్డి ఆదేశించారు. మండవల్లి మండలం పెరికేగూడెంలో పశు గణాభివృద్ధి సంస్థ, గన్నవరం ఆధ్వర్యంలో పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. జేసీ చేతుల మీదుగా పాడి రైతులకు లవణ ప్యాకెట్లు అందజేశారు. గన్నవరం పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ శ్రీనివాస రావు, డాక్టర్ గంగవరపు రామకృష్ణ, క్రాంతి కుమార్, డాక్టర్ డీవీ వరప్రసాద్, పాల్గొని వైద్య సేవలు అందించారు.

ముదినేపల్లిలో పొలం పిలుస్తోంది

ముదినేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో వ్యవసాయ శాఖ బుధవారం పొలం పిలుస్తోంది కార్య క్రమాన్ని నిర్వహించింది. కోతకు సిద్ధంగా ఉన్న పొలాలను పరిశీలించిన అనంతరం రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించిన సమావేశంలో మండవల్లి ఏడీఏ వెంకట మణి, ఏవో వేణుమాధవ్, పశువైద్యాధికారి డాక్టర్ క్రాంతి కుమార్ రైతులకు పలు సూచనలు చేశార

నిండిన తాగునీటి చెరువు

కలిదిండి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మట్టగుంటలో అడుగంటిన తాగునీటి చెరు వును సర్పంచ్ అంద్రాజు రత్నమణి ఆధ్వ ర్యంలో అధికారులు, గ్రామ పెద్దల సహ కారంతో పూర్తిస్థాయిలో నింపారు. గ్రామ స్థులు స్వచ్ఛందంగా రేయింబవళ్లు కాల్వ వెంబడి నాలుగు రోజులపాటు కాపలా కాస్తూ యుద్ధప్రాతిపదికన మోటార్ పంపు లతో తాగునీటి చెరువును నింపారు. కుళా యిల ద్వారా తాగునీటిని సరఫరా చేయడం తో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా కోటి దీపోత్సవం

కైకలూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసమహోత్సవాల సందర్భంగా కైకలూరు శ్యామలాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం కోటి దీపోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. 100 మంది దంపతులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కూటమి నేతలు వేంపాటి విష్ణురావు, పూల రామచంద్రరావు, పేరిచర్ల ప్రసాదరాజు, కొల్లి వరప్రసాద్, కేకే బాబు, బోయిన శ్రీనివాసు, చెరుకువాడ బలరామరాజు, కట్టా వీరరాఘవులు పాల్గొన్నారు.



కోటి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని

చరిత్రకు అనుగుణంగా దేవాలయాల అభివృద్ధి

ముదినేపల్లి : గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాలను అభివృద్ధి చేసి దర్శనీయ క్షేత్రాలుగా రూపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కామినేని అన్నారు. గురజలోని గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవ స్థానంలో బుధవారం కార్తీక అన్నసమారాధనలో పాల్గొని పూ జలు జరిపారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీ నర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వినోద్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి జగన్మోహనరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు పాల్గొన్నారు.